

మేడ్చల్ కలెక్టరేట్ ఆవరణలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో..

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్


దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి, వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్ టీమ్..

- హైకోర్టు స్టేటస్‌కో ఉన్నప్పటికీ రికార్డులు తారుమారుకు యత్నం:సతీష్..
- వవాదంలో ఉన్న 4.38 ఎకరాలు జీవేందర్ రెడ్డికి కట్టబెట్టి కలెక్టర్ ప్రొసీడింగ్స్..
- దుండిగల్ మాజీ ఎమ్మార్వో మతిన్, సర్వే అధికారిపై విచారణకు డిమాండ్..
- 60-70 ఏళ్ళు వ్యవసాయం చేసిన రైతులకు హక్కులు కల్పించకపోయినా..!
- అక్రమార్కులకు కట్టబెట్టడంలో అధికారులు ఉత్సుకత చూపడం గమనార్హం..
- అక్రమ కబ్జాపై క్రిమినల్ కేసు నమోదు చేసి భూమి స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి..
- సదరు భూమిని ప్రభుత్వ పాఠశాలకు కేటాయించాలని ఆకుల సతీష్ డిమాండ్..

# రూ.100 కోట్ల భూమి కబ్జాలో..!
# అధికారులే కీలక సూత్రదారులా..?

కంచే చేనుమేస్తే ఇక కాపాడేది ఎవరు..? ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా నియమించిన రెవెన్యూ అధికారులే కబ్జాదారులతో చేతులు కలిపితే, కాపాడేదెవరు..? దుండిగల్ గండిమైసమ్మ మండలంలో ఈ భూ కబ్జాలకు అధికారుల సహకారం కొత్తేమి కాకపోయినా..! ఓ ఇద్దరు అవినీతి అధికారుల పనితీరు, గడ్డితినే పశువుల కంటే హీనంగా తయారైందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. సుమారు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తికి కట్టబెట్టేందుకు, చేపట్టిన చర్యలు పలువురిని అబ్బుర పరుస్తుంది.. దౌర్భాగ్యం ఏమిటంటే, రెండేళ్ళ క్రితం అదనపు కలెక్టర్ ఆదేశాలతో, ప్రభుత్వ భూమిలో కబ్జాలను కూల్చేసిన, అదే తహశీల్దార్, అదే స్థలాన్ని సర్వేయర్‌తో కుమ్మక్కై అక్రమార్కులకు కట్టబెట్టి కలెక్టర్ ప్రొసీడింగ్ జారీకి కారణం కావడం గమనార్హం.. సంబంధిత ఎమ్మార్వోపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు దారులు డిమాండ్ చేస్తున్నారు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 30:**

కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్నా..! ఇన్‌వార్డులో ఇవ్వాల్సిందే.. అలాంటిది ప్రభుత్వ భూమిని అధికారుల సహకారంతో, ఆక్రమించిన వారికి, ప్రొసీడింగ్ ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఫొటోలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆకుల సతీష్ టీమ్ ఆరోపిస్తున్నారు.. ఈ భూమిలో మరో విచిత్ర ఘటన చోటుచేసుకుంది.. వక్రమార్గంలో కబ్జాదారునికి కట్టబెట్టి మాజీ తహశీల్దార్, ఇదే భూమిలో 2024 జూలై 7న కబ్జాలను తొలగించినది కూడా ఆ ఎమ్మార్వోనే.. ఆ కూల్చివేతల తర్వాత భూమిని కట్టబెట్టేందుకు ఏమేరకు ముడుపులు తీసుకున్నారో అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

- హైకోర్టు స్టేటస్‌కో అమలు చేయండి.. రికార్డులు మార్చే అవకాశం ఉంది..
- తప్పుడు అధికారులపై తక్షణమే విచారణ జరిపించాలని ఆకుల సతీష్ డిమాండ్..!
- సర్వే నెంబర్‌ల మార్పుతో 5 ఎకరాల ప్రభుత్వ భూమి బదిలీపై ఆరోపణలు..



జిల్లా కలెక్టర్ మను నుంచి, జీవన్‌రెడ్డి ప్రొసీడింగ్ తీసుకున్న నాటి.. ఫైల్‌ఫొటో.

### రైతులకు లేని హక్కు.. కబ్జాదారులకు ఎక్కడిది..?

బౌరంపేట్ గ్రామ రైతులకు కేటాయించిన, సర్వే నెంబర్ 166 లావణ్య పట్టా భూముల్లో.!దాదాపు 60-70 సంవత్సరాలు వ్యవసాయం చేసుకుంటూ, కాపాడిన రైతులకు హక్కు లేదంటూ, స్వాధీన పరచుకున్న ప్రభుత్వం, ఇప్పుడు కబ్జాదారులకు హక్కు ఎక్కడిది..? అంటూ స్థానికులు మండి పడుతున్నారు.. స్థానిక నాయకుడు పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ. రైతుల పేర్లను ధరణి పోర్టల్‌లో నమోదు చేయాలని, ఎన్వోసీలు జారీ చేయాలని, పలుమార్లు కలెక్టర్, ఆర్డీఓలకు వినతులు సమర్పించినా..! ఎవరూ పట్టించుకోలేదని అన్నారు.. రైతుల ఆధీనంలో ఉన్న ఈ భూములను 2015లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని అధికారులే చెబుతుండగా..! అదే భూములను ఇతరులకు అక్రమంగా కట్టబెట్టడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. జీవేందర్ రెడ్డి అనే వ్యక్తికి స్పష్టమైన పట్టా లేదు, పొజిషన్ లేకుండానే ప్రభుత్వ భూమిని అప్పగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు...

### ఒకచోట భూమిని.. మరోచోట చూపడం ఏంటి..?

మాజీ సైనిక ఉద్యోగులకు భూమి కేటాయింపును ఎవరూ వ్యతిరేకించడం లేదు.. అయితే బౌరంపేట్ సర్వే నెం.166/1లో 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.. సంబంధిత ప్రభుత్వ భూమిలో కొంత "మల్లంపేట్-బౌరంపేట్" నడుమ ఉన్న కత్వ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లోనూ ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ సర్వే నెంబర్ 166/1 ప్రభుత్వ భూమిని, వక్రమార్గంలో సర్వే నెం.166/9/2గా చూపించి అక్రమంగా రికార్డులు తారుమారు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆకుల సతీష్ టీమ్ అండ్ స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఈ వ్యవహారంలో మాజీ తహశీల్దార్ తోపాటు, ఏడి సర్వేయర్ కీలకంగా సహకరించినట్టు ఆరోపణలు ఉన్నాయి.. అంతటితో ఆగకుండా, మరో దారుణానికి తెరలేపినట్టు బలమైన ఆధారాలు ఉన్నాయి.. జిల్లా కలెక్టర్ 4.38 ఎకరాలు జీవేందర్ రెడ్డికి కట్టపెట్టి ప్రొసీడింగ్ జారీ చేయడంలో, మాజీ తహశీల్దార్, ఏడి సర్వేయర్ కీలక సూత్రదారులుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు..


24

ISSUED UNDER RTI ACT 2005
K3/1765/25

conducted the Re-survey and on ground it is noticed that, the submitted old proposals is changed. Further, the new sub-division sketch by showing the Sy.No.166/1/2 to an extent of Ac.4-38 as per the physical possession shown by the applicant and adjacent land owners is prepared and submitted herewith. Further, on ground the said land is under cultivation along with one cattle shed.

This is submitted for favour of kind information and necessary action in the matter.

Encl: (as above)

Yours Faithfully
Tahsildar, 13/10/25
Gandimaisamma-Dundigal Tahsil.

Copy submitted to the District Collector, Medchal-Malkajgiri District for favour of Kind information.
Copy submitted to the Revenue Divisional Officer, Malkajgiri Division, Medchal-Malkajgiri District for favour of Kind information.




వక్రమార్గంలో భూమిని కట్టబెట్టిన రుజువులు..

మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మండలం, బౌరంపేట గ్రామ శివారు సర్వే నెం.166/9/2కు సంబంధించిన ప్రభుత్వ భూమి విషయమై, మేడ్చల్ జిల్లా కలెక్టర్, దుండిగల్ ఎమ్మార్వోకు గురువారం అధికారికంగా ఫిర్యాదు సమర్పించినట్లు ఆకుల సతీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.. ఆకుల సతీష్ టీమ్ చెబుతున్న వివరాల ప్రకారం..ఈ వ్యవహారానికి సంబంధించి W.P. No. 14584 of 2026 తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉంది.. 29 ఏప్రిల్ 2026 తేదీన హైకోర్టు స్టేటస్‌కో విధిస్తూ ఉత్తర్వులు జారీచేసిందని పేర్కొన్నారు.. అయినప్పటికీ, కొందరు వ్యక్తులతో అధికారులు కుమ్మక్కై, రికార్డుల్లో మార్పులు చేయడానికి ప్రయత్నిస్తున్నారనే సమాచారం ఉందని ఆకుల సతీష్ ఆరోపిస్తున్నారు.. ఇది హైకోర్టు ఆదేశాల ఉల్లంఘనకు దారితీసే తీవ్రమైన అంశంగా పరిగణించాలని అభిప్రాయపడ్డారు..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అంకిత గౌడ్.. అత్యుత్తమ ప్రతిభ..

**15 ఏళ్ళకే పదవతరగతిలో 458 మార్కులతో ఉత్తీర్ణత..**

**స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్..! సీఎం కప్ సాధించిన మైనర్ బాలిక..!**

- సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ ఈత ప్రాముఖ్యతపై మెస్సేజ్ చూసిన అంకిత..
- ఈతను సాధనంగా గుర్తించిన అంకిత గౌడ్ శిక్షణ పొంది గోల్డ్ మెడల్ సాధించింది..
- ఏడో తరగతి నుంచి నేరుగా టెన్త్ పరీక్ష రాసిన అంకిత 458 మార్కులు విజయం..
- స్విమ్మింగ్ చాంపియన్ అంకిత గౌడ్‌ను ఘన సన్మానించిన రవీందర్ ముదిరాజ్..
- సూరారం బాలిక అంకిత గౌడ్ (15) ప్రతిభకు గుర్తించి రవీందర్ ముదిరాజ్..
- చదువుకు వయస్సుతో సంబంధం లేదని నిరూపణ..

-4లో



## ఎస్‌ఎస్‌సి టాపర్‌లను.. సత్కరించిన బీఆర్‌ఎస్ యువనేత శ్రీకాంత్..

**సూరారం ప్రభుత్వ పాఠశాలలో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు..**

- బీఆర్‌ఎస్ యువ నాయకుడు కోలా శ్రీకాంత్ ఉదారత బహుమతులు అందజేత..
- విద్యార్థుల్లో పోటీ భావన పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహకాలు..
- ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు..

-5 లో





## విదేశీ 'మే డే' బహిష్కరించండి: బిఎంఎస్..

- మే 1 కాదు.. విశ్వకర్మ జయంతే భారత కార్మికుల దినోత్సవం..
- విశ్వకర్మ జయంతికి జాతీయ కార్మిక దినోత్సవ హోదా కోరిన బిఎంఎస్..

-5 లో

# అంకిత గౌడ్.. అత్యుత్తమ ప్రతిభ



అంకిత గౌడ్‌ను సత్కరించిన రవిందర్ ముదిరాజ్..

- 15 ఏళ్ళకే పదవతరగతిలో 458 మార్కులతో ఉత్తీర్ణత..
- స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్..! సీఎం కప్ సాధించిన మైనర్ బాలిక..!

- సామాజిక వేత్త రవిందర్ ముదిరాజ్ ఈత ప్రాముఖ్యతపై మెస్సేజ్ చూసిన అంకిత..
- ఈతను సాధనంగా గుర్తించిన అంకిత గౌడ్ శిక్షణ పొంది గోల్డ్ మెడల్ సాధించింది..
- ఏడో తరగతి నుంచి నేరుగా టెన్త్ పరీక్ష రాసిన అంకిత 458 మార్కులు విజయం..
- స్విమ్మింగ్ చాంపియన్ అంకిత గౌడ్‌ను ఘన సన్మానించిన రవీందర్ ముదిరాజ్..
- సూరారం బాలిక అంకిత గౌడ్ (15) ప్రతిభకు గుర్తించి రవీందర్ ముదిరాజ్..
- చదువుకు వయస్సుతో సంబంధం లేదని నిరూపణ..



సామాజిక బాధ్యతతో ఇత సాధనగా ప్రచారంలో రవిందర్ ముదిరాజ్.. ఫైల్‌ఫోటో..



విద్యార్థిని అంకిత గౌడ్‌కు స్వీట్లు తినిపిస్తున్న రవిందర్ ముదిరాజ్..

ఈత(స్విమ్మింగ్) అనేది ఒక సాధన.. ఇది తెలియక, అవగాహన లేక, నిత్యం ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారు.. గత రెండు దశాబ్దాలుగా ఈత ఒక సాధన, పాఠ్యాంశంగా చేర్చాలని వినతిపత్రాలు- విజ్ఞప్తులతో విస్తృత పోరాటం చేస్తున్న యోధుడు కోలా రవిందర్ ముదిరాజ్.. క్యాన్సర్ కారక ప్లాస్టిక్ నియంత్రణకు ఆయన పడని పాటులేదు.. పర్యావరణ పరిరక్షణకే, నిత్య ప్రచారకర్తగా, జీవితంలో ఆయన కేటాయించిన సమయమే ఎక్కువ.. అలాంటి పర్యావరణ వేత్త ఈత సాధనపై చేస్తున్న ప్రయత్నాన్ని, ఆయనను అనుసరించి పట్టుదలతో, ఈతను నేర్చుకున్న, ఓ మైనర్ బాలిక 15 ఏళ్ళకే స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించడం ఒకవంతైతే..! చదువులో 7వ తరగతి నుండి నేరుగా 10వ తరగతిలో పరీక్షలు రాసి ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సి ఫలితాల్లో 458 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది.. ఈతపై తన పోరాటాన్ని, ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు గుర్తించక పోయినా, ఒక మైనర్ బాలిక గుర్తించి విజయం సాధించిందని సామాజిక వేత్త కోలా రవిందర్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు.. ఆ 15 ఏళ్ళ మైనర్ బాలిక అంకిత గౌడ్‌ను ఆయన ఘనంగా సన్మానించారు.. **జీడిమెట్ల, పెన్ పవర్, ఏప్రిల్ 30:**


కుత్బుల్లాపూర్ మండలం సూరారం గ్రామ ప్రాంతానికి చెందిన రవికుమార్ గౌడ్ కుమార్తె ఎమ్. అంకిత గౌడ్ (15) తన ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంది. చిన్న వయస్సులోనే ఈతను సాధనగా అభ్యాసించి ప్రారంభిచిన అంకిత, క్రమంగా ఆమెకృషి ఫలితం, ఉన్నత స్థాయికి ఎదిగింది.. స్విమ్మింగ్‌లో గోల్డ్ మెడల్‌తో పాటు సీఎం కప్‌ను కూడా సాధించి ప్రతిభను చాటుకుంది.. ఈ అకాడమిక్‌లో కూడా అంకిత విశేష ప్రతిభ కనబరిచింది. ఏడవ తరగతి వరకు చదివి, నేరుగా పదవ తరగతి పరీక్షలు రాసి 458 మార్కులు సాధించి ప్రత్యేకంగా నిలిచింది.. ఈ సందర్భంగా సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు, ప్లాస్టిక్ నియంత్రణలో కీలక పోరాట యోధుడు, గురువారం ఆమెను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.. పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఈత వంటి నైపుణ్యాలను నేర్చుకోవడంతో పాటు చదువులోనూ అంకితభావంతో ముందుకు సాగాలని సూచించారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, ఎవరైనా ఏ వయస్సులోనైనా విద్యను అభ్యసించి విజయాన్ని సాధించవచ్చని పేర్కొన్నారు.. అంకిత గౌడ్ ఏడవ తరగతి నుంచి నేరుగా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించడం హర్షించదగ్గ విషయమని, ఈ విజయానికి తోడ్పాటును అందించిన దీక్ష స్కూల్ యాజమాన్యానికి కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.




ఈత సాధనంగా ప్రచారంలో తీసిన ఫైల్‌ఫోటో..



స్విమ్మింగ్‌లో అంకిత సాధిచిన మెడల్స్..



అంకిత స్విమ్మింగ్ సాధన.. ఫైల్‌ఫోటో..



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఈతను పాఠ్యాంశంగా చేర్చాలని రవిందర్ ముదిరాజ్ వినతిపత్రం.. ఫైల్‌ఫోటో..



సందర్భం ఏదైనా ఈత(స్విమ్మింగ్) సాధనగా రవిందర్ ముదిరాజ్ ప్రచారం..

# జయమ్మ బాటలో కవితమ్మ...

**నిజామాబాద్, ఏప్రిల్ 30 , పెన్ పవర్:**
మనసులో మాట.. అంటూ కొత్తగా తెలంగాణ రాష్ట్ర సేన(టీఆర్ఎస్) పార్టీని ప్రారంభించిన కవిత కీలక ప్రకటన చేశారు. అదే –తెలంగాణ తల్లి–గా తాను ఉండాలని భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సహజంగా ఇది తమిళనాడులో మాత్రమే చెల్లింది. అక్కడ ఉమ్మడి పార్టీ అంటే ద్రవిడ పార్టీ నుంచి అన్న డీఎంకే విడిపోయినప్పుడు.. ఎంజీఆర్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన జయలలిత(జయమ్మ) తనకంటూ ఒక సొంత కుంపటిని ఏర్పాటు చేసుకునే క్రమంలో తమిళ ప్రజలకు తల్లిగా పరిచయమయ్యారు.ఇలాగే ఆవిడ కూడా తనను తల్లిగా భావించాలని కోరుకున్నారు. తమిళనాడు ప్రజలు ఆమెను రిసీవ్ చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే.. ఆవిడ నటిగా తమిళ ప్రజల గుండెల్లో ఉన్నారు కాబట్టి అది సాధ్యమైంది. అప్పటికే వందలాది సినిమాల్లో ఆమె నటించారు. తమిళ ప్రజలను ఆకట్టుకున్నారు. కాబట్టి ఆమెను తల్లిగా భావించారు. అది సక్సెస్ అయింది. ఇప్పటికీ జయలలిత విగ్రహాలతో ఆలయాలు కట్టిన గ్రామాలు కూడా ఉన్నాయి తమిళనాడులో. కానీ ఆ పరిస్థితి కవితకు వస్తుందా.. ఆమె కామె అనుకుంటే తల్లిగా రిసీవ్ అవుతారా.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తెలంగాణ సమాజం ఒక విభిన్నమైన ఆలోచనతో ఉంటుంది. సెంటిమెంటు అంటే అది వ్యక్తిగత సెంటిమెంటు కంటే కూడా సమాజ సెంటిమెంటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ప్రజలు తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఒక ఘటనను తీసుకుంటే.. కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారుఇంతలో ఢిల్లీ నుంచి వచ్చిన సమాచారంతో ఆయన దీక్ష విరమణ చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ సమాజం తిరగబడే పరిస్థితి వచ్చింది. ఇంక తప్పని పరిస్థితుల్లో కేసీఆర్ దీక్షను కొనసాగించారు. అటువంటి సెంటిమెంటు ఉన్న తెలంగాణలో –నేను అమ్మ–ని అని పరిచయం చేసుకోవడం వరకు



బాగానే ఉన్నప్పటికీ తెలంగాణ సమాజం ఏ మేరకు దీన్ని ఆహ్వానిస్తుంది అనేది ప్రశ్న. ఇప్పటివరకు కవిత అంటే కెసిఆర్ కుమార్తె గానే చూశారు. ఒక ఎంపీగా ఒక ఎమ్మెల్సీగా ఒక రాజకీయ నాయకురాలుగా ఒక జాగృతి అధ్యక్షురాలుగా చూశారే తప్ప అకస్మాత్తుగా –నేను అమ్మ–ని అని ఆవిడ చెప్పినంత మాత్రాన తెలంగాణ సమాజం ఆ రకంగా రిసీవ్ చేసుకోవడం కష్ట సాధ్యం. అంతేకాదు ఆవిడ చెప్పినంత తేలికగా తెలంగాణ సమాజం కవితను అమ్మగా చూసే పరిస్థితి కూడా ఉండదు. ఎవరికి ఉండే అంచనాలు వారికి ఉంటాయి తప్పేమీ కాదు. కానీ.. ఎక్కువగా ఊహించు కుంటేనే ప్రమాదం. ఈ విషయంలో కవిత ఆలోచించుకుని అడుగులు వేయడం ఉత్తమమని పరిశీలకులు చెబుతున్నారు.

# కరీంనగర్ లో కయ్యాల కాంగ్రెస్

**కరీంనగర్, ఏప్రిల్ 30, పెన్ పవర్:**
కాంగ్రెస్ అంటేనే కయ్యాల పార్టీ. తెలుగు రాష్ట్రాల్లో అయితే మరీ ఎక్కువ. ఒక నేత ఎదుగుదలను మరో నేత ఓర్వలేడు. ఒకరి ఆధిపత్యాన్ని మరొకరు సహించరు. ఎవరికి వారు గ్రూపులుగా ఉంటారు. అవసరమైతే అధిష్టానాన్ని కూడా బూతులు తిడతారు. తర్వాత కలిసే ఉంటారు. ఏమన్నా అంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని పెద్దపెద్ద మాటలు చెబుతారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో కొన్నాళ్లు కయ్యాలు కనిపించలేదు. కానీ ఆరు నెలలుగా లుకలుకలు బయటపడుతున్నాయి. తాజాగా కరీంనగర్‌లో బిభేదాలు రచ్చకెక్కాయి. కరీంనగర్ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి నియామకం వివాదం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. స్థానిక నేతల అసంతృప్తి, అధిష్ఠాన నిర్ణయాలపై బహిరంగ తిరస్కారం శ్రేణుల్లో గందరగోళాన్ని మురికి చేస్తోంది.వెలిచాల్ రాజేందర్ రావును కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం పలువురు స్థానిక నాయకుల అభ్యంతరానికి దారితీసింది. సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు తమ పేర్లతో వినతిపత్రాలు సమర్పించారని, తమ సమ్మతి లేకుండానే జరిగిందని మండిపడ్డారు. సన్నాహక సమావేశాల్లోనే విభేదాలు బహిర్గతమై, గొడవల వరకు వెళ్లింది.మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లాంటి మునుపటి నాయకులు పార్టీ నాయకత్వంపై ఫైర్ అవుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల్ రాజేందర్ రావును లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల్లో సహకారం లేకపోవడం, టికెట్ కేటాయింపుల్లో భేదం వంటి ఆరోపణలు ఉన్నాయి. డీసీసీ కార్యాలయంలో రహస్య సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.కరీంనగర్ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట జరుగుతోంది. గత మున్సిపల్ మున్సిపల్ ఎన్నికల్లో 66 డివిజన్లలో కేవలం 14 సీట్లకే పరిమితమైంది. ఇన్‌చార్జి లేకపోవడం, జిల్లా అధ్యక్ష పదవి ఆలస్యం ఈ సమస్యలకు ఆధారం. మంత్రివర్గ విస్తరణలో కూడా స్థానికులకు ప్రాధాన్యత లేకపోవడంపై నిరాశ వ్యక్తమవుతున్నారు. ఈ వివాదం పీసీసీ స్థాయికి చేరి, సస్పెన్షన్ డిమాండ్లు ఉయరుతున్నాయి. ఎన్నికల విషయాల్లో పార్టీ బలం తగ్గుతున్న ఈ ప్రాంతంలో ఇది మరింత దెబ్బ తీస్తుంది.అధిష్టానం త్వరగా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహించి, పునర్నియామకాలు చేయాలి. పారదర్శకత, స్థానిక ప్రాతినిధ్యం పెంచితే శ్రేణులు ఏకతాటిపై నడవవచ్చు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో మూడో స్థానానికి మాత్రమే పరిమితమవుతుంది.

# మే చివరి వారంకానీ జూన్ లో పంచాయితీ పోల్స్ కు ఏర్పాట్లు

**విజయవాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 13,100 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యుల పదవీకాలం ముగియడంతో పాలన మొత్తం ప్రత్యేక అధికారుల చేతుల్లోకి వెళ్ళింది. ప్రభుత్వం ఈ వేసవిలోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని భావిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్ వ్యవస్థ మళ్ళీ పట్టాలెక్కే సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో, క్షేత్రస్థాయిలో పాలన స్తంభించకుండా ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే, గతంలో ఎదురైన చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి సుదీర్ఘకాలం అధికారుల పాలనను కొనసాగించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృఢ నిశ్చయంతో ఉన్నారు. వీలైనంత త్వరగా అంటే.. మే లేదా జూన్ నెలల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ఉండటంతో, ప్రభుత్వ భవనాలు, ఉపాధ్యాయుల సేవలను ఎన్నికల విధులకు వినియోగించుకోవడం సులభతరం అవుతుంది. ఇదే తరుణంలో ఎన్నికలు నిర్వహిస్తే అటు విద్యా సంవత్సరంపై ప్రభావం ఉండదని, ఇటు వర్షాకాలం మొదలవ్వకముందే కొత్త పాలకవర్గాలు కొలువు తీరుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం దీనిపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం.వార్డుల పునర్విభజన , రిజర్వేషన్ల ప్రక్రియ అత్యంత కీలకంగా మారింది. 2024 అసెంబ్లీ ఎన్నికల నాటి భారీ విజయం తర్వాత వస్తున్న ఈ స్థానిక ఎన్నికలను కూటమి పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. జనసేన, బీజేపీలతో కలిసి రిజర్వేషన్ల కేటాయింపులో ఎక్కడా వివాదాలు రాకుండా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సాంకేతిక ప్రక్రియ మే నెలలో పూర్తి చేసి, జూన్ కల్లా పోలింగ్ నిర్వహించేలా కార్యాచరణ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.ప్రతిపక్ష వైసీపీ కూడా ఈ ఎన్నికలపై గట్టి ఆశలే పెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత తమ క్యాడర్‌లో మళ్ళీ ఉత్సాహాన్ని నింపాలంటే స్థానిక సంస్థల ఎన్నికలే సరైన వేదిక అని వైఎస్ జగన్ భావిస్తున్నారు. అయితే, అధికార పార్టీపై సానుకూలత ఉన్న సమయంలోనే ఎన్నికలకు వెళ్లడం ద్వారా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని టీడీపీ భావిస్తోంది. ఉపాధి హామీ నిధులు, గ్రామాలకు వచ్చే కేంద్ర నిధులను సక్రమంగా వినియోగించాలంటే ఎన్నికైన పాలకవర్గాలే ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ నిబంధన కూడా దీనికి ప్రధాన కారణం. వేసవి సెలవుల లోపు నోటిఫికేషన్ విడుదల కాకపోతే, జూలైలో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. అందుకే, సెక్షన్ 14 కింద ఉన్న అధికారాలను ఉపయోగించి, వీలైనంత వేగంగా ఓటర్ల జాబితాల సవరణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# ఇవాళ్టి నుంచి సర్కారీ మెట్రో...

**హైదరాబాద్, ఏప్రిల్ 30, పెన్ పవర్:**
హైదరాబాద్ మహానగర ముఖ చిత్రాన్ని మార్చేసిన లక్షలాది మందికి చేరువైన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టులో ఒక కీలక అధ్యాయం ముగిసింది. ఇన్నాళ్లూ ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యం కింద లార్సన్ అండ్ టూబ్రో(ఎల్ అండ్ టీ) నిర్వహణలో ఉన్న మెట్రో మొదటి దశ, ఇప్పుడు పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ వశమైంది. దాదాపు 15 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోగా మెట్రో పగ్గాలను ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైలు మొదటి దశను హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ ద్వారా స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చింది.. ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్‌లో ఉన్న మొత్తం వంద శాతం ఈక్విటీని 1, 461.47 కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ఒప్పంద పత్రాలపై హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, ఎల్ అండ్ టీ ప్రతినిధి డీకే సేన్, ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణరావు, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మెట్రో మాజీ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సాక్షులుగా ఉన్నారు అంతకు ముందు ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ ప్రక్రియపై చర్చించారు. మెట్రోను స్వాధీనం చేసుకోవడంలో కేవలం వాటాలను కొనుగోలు మాత్రమే కాకుండా భారీ ఆర్థిక బాధ్యతలను కూడా ప్రభుత్వం స్వీకరించింది. ఏప్రిల్ 30, 2026 నాటికి ఎల్ అండ్ టీ మెట్రోపై ఉన్న 13, 538.53 కోట్ల అప్పును ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం హామీతో రీఫైనాన్స్ చేయనున్నారు. ఈ లావాదేవీ పూర్తి అయిన తర్వాత ఎల్ అండ్‌టీ ఈ మెట్రో ప్రాజెక్టుతో ఎటువంటి అనుబంధం ఉండదు. ఈ ప్రక్రియ జూన్ 30 నాటికి



పూర్తి కావచ్చుని అంచనా. ఈ భారీ లావాదేవీకి ఐడీబీఐ క్యాపిటల్ టాన్సాక్షన్ అడ్వైజర్‌గా, సరఫ్ అండ్ పార్టనర్స్ లీగల్ అడ్వైజరీగా వ్యవహరించాయి. హైదరాబాద్ మెట్రో ప్రయాణం 2010లో ప్రారంభమైంది. మొదట మేటాస్ కన్సార్షియం ఈ టెండర్ పొందినా, సత్యం కుంభకోణం తర్వాత అది రద్దు అయ్యింది. 2010లో జరిగిన రెండో టెండర్లలో ఎల్ అండ్ టీ అత్యంత తక్కువ కోట్ చేసి ప్రాజెక్టును దక్కించుకుంది. అప్పట్లో ఇది ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ ప్రాజెక్టుగా గుర్తింపు పొందింది. 71 కిలోమీటర్ల మేర ప్రాజెక్టు అంచనా వ్యయం మొదట 12, 132 కోట్లు కాగా, పూర్తి అయ్యే సరికి ఇది పెరిగింది. బ్యాంకుల నుంచి 11, 478 కోట్ల రుణం, ఎల్ అండ్ టీ వాటా 3,440 కోట్లుగా ఉంది. మొదటి దశ 2017నవంబర్ 29న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల మేర మూడు కారిడార్లలో సేవలు అందుతున్నాయి.

ప్రభుత్వ స్వాధీన నిర్ణయానికి కారణాలు ఇవే

ఎల్ అండ్ టీ ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగడానికి, ప్రభుత్వం దీనిని స్వీకరించడానికి బలమైన కారణాలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో ఆరు నెలలపాటు మెట్రో నిలిచిపోవడంతో ప్రాజెక్టు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయింది. ప్రభుత్వం అప్పట్లో 900 కోట్ల వడ్డీ లేని రుణాన్ని కూడా ఇచ్చింది. మొదట 35 ఏళ్ల ఒప్పందం ఉండగా, దానిని 2072 వరకు అంటే మరో పాతికేళ్లు పొడిగించారు. అయితే ఆర్థిక ఒత్తిడి కారణంగా ఎల్ అండ్ టీ తప్పుకోవాలని భావించింది. మొదటి దశ ప్రైవేటు వద్ద, రెండో దశ ప్రభుత్వం వద్ద ఉంటే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని ప్రభుత్వం భావించింది. ఇప్పుడు రెండు దశలూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉండటం వల్ల సమగ్ర రవాణా వ్యవస్థను నిర్మించడం సులభమవుతుంది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో నిత్యం సగటున 4.50 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఇప్పటి వరకు 86 కోట్ల ప్రయాణాలు నమోదు అయ్యాయి. మెట్రో ప్రభుత్వపరమవ్వడం వల్ల భవిష్యత్‌లో కొత్త మెట్రో లైన్ల నిర్మాణం పాత కారిడార్ల అనుసంధానం వేగవంతం అవుతుంది. ప్రయాణికుల అవసరాలు అనుగుణంగా ఛార్జీలు, సమయపాలన, ఇతర సదుపాయాలపై ప్రభుత్వం పూర్తి నిర్ణయాధికారం కలిగి ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన ఫ్యూచర్ సిటీకి మెట్రోను అనుసంధానించే ప్రక్రియ మరింత సులభతరం చేయవచ్చు.

## మెట్రో మైలు రాళ్లు...

**హైదరాబాద్, ఏప్రిల్ 30, పెన్ పవర్:** భాగ్యనగర మెట్రో రైలు ప్రయాణాల్లో సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ నెల 24వ తేదీ నాటికి మెట్రో రైలు ప్రారంభమైనప్పటి నుండి మొత్తం ప్రయాణీకుల సంఖ్య 850 మిలియన్లకు (85 కోట్లు) చేరుకుంది. గత ఏడాది డిసెంబర్ 19న ఈ సంఖ్య 800 మిలియన్లుగా ఉండగా, కేవలం 126 రోజుల వ్యవధిలోనే మరో 50 మిలియన్ల (5 కోట్లు) మంది మెట్రోలో ప్రయాణించారు. ప్రస్తుతం సగటున రోజుకు 3.96 లక్షల మంది మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు.గతంలో రోజువారీ సగటు ప్రయాణీకుల సంఖ్య 4.50 లక్షల వరకు ఉండేదని, అయితే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత మెట్రో ప్రయాణీకుల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టినట్లు ఎల్ అండ్ టీ మెట్రో వర్గాలు భావిస్తున్నాయి. దీనికి తోడు మెట్రో స్టేషన్ల వద్ద 'ఫస్ట్ అండ్ లాస్ట్ మైల్ కనెక్టివిటీ' (స్టేషన్ల వరకు చేరుకునే రవాణా సౌకర్యాలు) సరిగ్గా లేకపోవడం కూడా ఒక ప్రధాన లోపంగా కనిపిస్తోంది.ఇటీవల ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె సమయంలో బస్సులు నిలిచిపోయినప్పటికీ, మెట్రోలో ఆశించిన స్థాయిలో రద్దీ పెరగకపోవడం అధికారులను ఆశ్చర్యపరిచింది. సమ్మె తొలిరోజున గరిష్టంగా 4.90 లక్షల మంది ప్రయాణించినా, ఆ సంఖ్య 5 లక్షల మార్కును దాటలేకపోయింది.మెట్రోలో ప్రయాణీకుల సంఖ్యను పెంచేందుకు సమయాల్లో మార్పులు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు .ప్రస్తుతం ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతున్న సర్వీసులను, ఉదయం 5 గంటలకే ప్రారంభించాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ముఖ్యంగా సికింద్రాబాద్ వంటి రైల్వే స్టేషన్లకు వచ్చే దూరప్రాంత ప్రయాణీకులకు ఇది ఎంతో మేలు చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు కూడా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాత్రి 11 గంటలకే నిలిచిపోతున్న సేవలను కనీసం అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించాలని కోరుతున్నారు.ఈ సూచనలను పరిశీలించాలని మెట్రో రైలు ఎండీకి ప్రభుత్వం సూచించింది. సరైన రవాణా అనుసంధానం , సమయాల మార్పు చేపడితే మెట్రో మరింత లాభదాయకంగా మారుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పెద్ది బిగ్ ట్వీట్...

**హైదరాబాద్, ఏప్రిల్ 30, పెన్ పవర్:** గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరో గా నటిస్తున్న 'పెద్ది' మూవీ షూటింగ్ రేపటితో పూర్తి అవ్వబోతుంది. గత మూడు రోజులుగా రామ్ చరణ్ , శృతి హాసన్ లపై ఐటెం సాంగ్ ని చిత్రీకరిస్తున్నారు. రేపటితో ఈ సాంగ్ చిత్రీకరణ ముగుస్తుంది. ఇకపోతే ఈ చిత్రాన్ని జూన్ 25 న విడుదల చేయబోతున్నట్టు డైరెక్టర్ బుచ్చి బాబు రీసెంట్ గా జరిగిన ఒక ఈవెంట్ లో ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే జూన్ 4 నుండి టాక్సిక్ చిత్రం వాయిదా పడడంతో , ఇప్పుడు 'పెద్ది ' ని జూన్ 4 న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇదంతా పక్కన పెడితే ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియా లో బాగా వైరల్ అయ్యాయి.పూర్తి వివరాల్లోకి వెళ్తే 'పెద్ది' లో రామ్ చరణ్ ఇప్పటి వరకు క్రికెట్ ఆడడం చూసాము, అదే విధంగా కుస్తీ ఆడడం కూడా చూశాము , ఇప్పుడు రామ్ చరణ్ ఈ చిత్రం లో మూడవ స్పోర్ట్ కూడా ఆడాడట. మరి ఆ స్పోర్ట్ ఏంటి అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. సినిమాలో చివరి 40 నిమిషాల్లో వచ్చే స్పోర్ట్ లో రామ్ చరణ్ నట విశ్వరూపం చూపించాడని , ఫ్యాన్స్ తో పాటు ఆడియన్స్ నుండి కూడా ఆయనకు ఈ చివరి 40 నిమిషాల్లో చేసే నటనకు ప్రశంసల వర్షం కురిపిస్తారని, రామ్ చరణ్ కి ఈ సినిమా ద్వారా మొట్టమొదటి నేషనల్ అవార్డు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. త్వరలోనే ఈ స్పోర్ట్ కి సంబంధించిన టీజర్ ని కూడా విడుదల చేయబోతున్నారట మేకర్స్. ఇకపోతే ఈ సినిమాకు సంబంధించిన ఓవర్సీస్ అడ్వాన్స్ బుకింగ్స్ మే మొదటి వారం లో మొదలయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

## భావోగ్వేదనికి లోనైన సిపి సుదీర్ బాబు.

**ఇబ్రహీంపట్నం: పెన్ పవర్:**రంగారెడ్డి జిల్లా ఇబ్రహింపట్నం 3వ బెటాలియన్లో ఫ్యూచర్ సిటీలో గౌరవ వందనం స్వీకరించిన కమిషనర్ జి. సుధీర్ బాబు గురువరాం ఇబ్రహింపట్నం 3వ బెటాలియన్లో రిటైర్మెంట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అందరి సహకారం వల్లే ముందుకు కోన సాగడం జరిగింది. ఈ పెరేడ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది. దాదాపు 31 సంవత్సరాల కాలం వివిధ హోదలలో పని చేయడం జరిగిందని బావోగ్వేదనికి లోనైయారురు. పని చేయడం మన బాధ్యత ఫలితం అదే వస్తుంది. ప్రతి స్థాయి నుండి మనం చేసే పనిలో ఎత్తు పల్లాలు ఉంటాయి వాటిని అధిగమించి ముందుకు సాగాలి. పోలీస్ శాఖలో ఎవరికి రాని అవకాశాలు నాకు మాత్రమే దక్కాయి. వివిధ కమిషనరేట్ పరిధిలో నాలుగు సార్లు సిపిగా విధులు నిర్వహించడం జరిగింది . పూర్వ రాచకొండ ప్రస్తుత ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ను నెంబర్ వన్ స్థానాన్ని అందిపుచ్చుకున్నాం. క్రైమ్, సైబర్ నేరాలు ,ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణ కల్పించడంలో క్షేత్రస్థాయిలో పనిచేసిన పోలీస్ అధికారుల పాత్ర కీలకం అందరు సమిష్టి కృషితోనే ఫలితాలను సాధించాం అని సిపి సుదీర్ బాబు అన్నారు.

## మేడిపల్లి పీఎస్ పరిధిలో వరుస చోరీల నిందితుడు అరెస్ట్

**- రిమాండ్‌కు తరలింపు**

**మేడ్చల్: పెన్ పవర్:**మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వరుస ఇళ్ల చోరీల కేసులను మేడిపల్లి పోలీసులు ఛేదించి, అలకుంట్ల ప్రశాంత్ (19) అనే పాత నేరస్తుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బోడుప్పల్, పీర్జాదిగూడ, కంచన్‌బాగ్, సింగారం ప్రాంతాల్లో రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.
సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో పీర్జాదిగూడలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2026 ఫిబ్రవరి నెల నుంచి ఈ వరుస చోరీలకు సంబంధించి మేడిపల్లి పీఎస్‌లో మొత్తం 10 కేసులు నమోదు కాగా, అన్నింటిలోనూ
ప్రశాంతే నిందితుడిగా గుర్తించారు. గతంలో 2023 సంవత్సరంలో మైనర్‌గా ఉండగానే పలు దొంగతనాల్లో పాల్గొని జువెనైల్ హోమ్‌కు వెళ్లి వచ్చినప్పటికీ, మార్పు లేక మళ్లీ నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బైక్, ఐఫోన్, సుమారు 40 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. అతడిని కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలించగా, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందనిపోలీసులు తెలిపారు.

## ప్రభుత్వం భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి

**హైదరాబాద్: పెన్ పవర్:**రాష్ట ప్రభుత్వ సలహాదారుగా ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డిని ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర డిజిపిగా ఉన్న ఆయన గురువారం పదవీ విరమణ చేసారు. ఈ నేపథ్యంలో ఆయన సేవలను ఉపయోగించుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం భద్రతా సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కాళేశ్వరంపై రేవంత్ మార్క్ యుద్ధం

**హైదరాబాద్, ఏప్రిల్ 30, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అదే సమయంలో వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. ప్రాజెక్టు వైఫల్యాలు, నిధుల దుర్వినియోగంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ– సీబీఐ చేత దర్యాప్తు చేయించడం ద్వార అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు.సాధారణంగా ఇలాంటి భారీ ప్రాజెక్టులపై విచారణలు న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకుపోతుంటాయి. దీనిని ముందుగానే పసిగట్టిన రేవంత్ సర్కార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తాజాగా మధ్యంతర ఆదేశాలు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన సీబీఐ సిఫారసులో ఆ కమిషన్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడింది. దీనికి బదులుగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలను, ప్రాజెక్టులో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణలను ప్రధాన ప్రాతిపదికగా చూపారు. 9 నెలల కిందటే పంపిన ఈ సిఫారసు ద్వారా సీబీఐ రంగప్రవేశానికి ఉన్న సాంకేతిక అడ్డంకులను ప్రభుత్వం తొలగించింది. వ్యవస్థాగతమైన దర్యాప్తు ద్వారా బాధ్యులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలకు ఉపక్రమిస్తే, అది రాజకీయంగా కక్షసాధింపు అనే ముద్ర పడి సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే ఈ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిన ఈకుంభకోణంపై కేంద్రమే విచారణ జరిపించాలని కోరడం ద్వారా బీజేపీ చిత్తశుద్ధిని రేవంత్ పరీక్షకు పెట్టారు. ఒకవేళ కేంద్రం సీబీఐ విచారణకు వెనుకాడుతే, "మోదీ–కేసీఆర్ ఒక్కటే" అనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, బీజేపీని డిఫెన్స్‌లో పడేయాలన్నది కాంగ్రెస్ వ్యూహం. సీబీఐ దర్యాప్తునకు పచ్చజెండా ఊపితే ఆ క్రెడిట్ రేవంత్ ఖాతాలోకి వెళ్తుంది. ఒకవేళ మౌనంగా ఉంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారన్న విమర్శలు వస్తాయి.కేవలం లేఖలతోనే సరిపెట్టకుండా, రేవంత్ రెడ్డి స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవాలని లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని నిశ్చయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను స్వయంగా అందజేయడం ద్వారా దర్యాప్తును అనివార్యం చేయాలన్నది వారి ప్లాన్. విచారణ జరిగినా, జరగకపోయినా.. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందవచ్చని, ప్రజాధనం విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. ఒకవేళ విచారణ ప్రారంభమై కేసీఆర్ కుటుంబం చుట్టూ ఉచ్చు బిగిస్తే, తెలంగాణ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను మార్పులు సంభవించడం ఖాయం. రేవంత్ రెడ్డి పన్నిన ఈ చక్రవ్యూహం నుండి ప్రత్యర్థులు ఎలా బయటపడతారో వేచి చూడాలి.

# ఇవాళ్టి నుంచి భారీగా రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ



**హైదరాబాద్, ఏప్రిల్ 30, పెన్ పవర్:** తెలంగాణలో స్థిరాస్తి కొనుగోలు చేయాలనుకునే వారికి బ్యాడ్ న్యూస్. మే 1 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఖజానా నింపుకునేందుకు సిద్ధమైంది. అపార్ట్‌మెంట్ అయినా, ప్లాట్ అయినా, వ్యవసాయ భూమి అయినా.. ఇకపై మీ జేబుకు చిల్లు పడటం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఆస్తుల మార్కెట్ విలువలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మే మొదటి వారం నుంచే అమల్లోకి రానుంది. ఈ మార్పుతో రిజిస్ట్రేషన్ ఛార్జీలు, స్టాంప్ డ్యూటీ భారం ఒక్కసారిగా పెరగనుంది.రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన కేబినెట్ ఉపసంఘం ఇటీవల సచివాలయంలో కీలక భేటీ నిర్వహించింది. రాష్ట్ర ఆదాయ మార్గాలను పెంచుకోవడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో.. ఆస్తుల మార్కెట్ విలువల సవరణకు పచ్చజెండా ఊపారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ ధరలకు, ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న ధరలకు మధ్య పొంతన లేకపోవడాన్ని గమనించిన ప్రభుత్వం, ఈ వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా కొత్త రేట్లను సిద్ధం చేయాలని రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖను ఆదేశించింది.ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఈ విలువల సవరణ ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు అదనంగా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూరనుంది. కేవలం ఆదాయం మాత్రమే కాకుండా, మార్కెట్ ధరలను క్రమబద్ధీకరించడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగంలో నల్లధనం ప్రవాహాన్ని అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. చాలా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్ ధరలు ఆకాశంలో ఉండగా, రిజిస్ట్రేషన్ విలువలు మాత్రం తక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఈ గ్యాప్‌ను పూడ్చడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు వ్యూహంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయం వల్ల మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. పట్టణ ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలు, ఓపెన్ ప్లాట్ల విలువలు గణనీయంగా పెరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల విలువలను కూడా భారీగా పెంచబోతున్నారు. కమర్షియల్ ప్రాపర్టీల రిజిస్ట్రేషన్ రేట్లు కూడా చుక్కలు చూపించనున్నాయి. కేవలం ఆస్తి విలువ పెరగడమే కాకుండా, ఆ పెరిగిన విలువపై చెల్లించే స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు అన్నీ కలిపి కొనుగోలుదారుడిపై భారాన్ని రెట్టింపు చేస్తాయి.తెలంగాణలో గతంలో 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్ విలువలను సవరించింది. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపడుతున్న తొలి విలువల సవరణ ఇదే కావడం గమనార్హం. నిజానికి ఏడాది క్రితమే ఈ రేట్లు పెరగాల్సి ఉన్నప్పటికీ, అప్పట్లో రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న మందగమనం కారణంగా ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మార్కెట్ మళ్లీ పుంజుకోవడంతో ఈ నిర్ణయాన్ని అమలులోకి తెస్తోంది.మే మొదటి వారం నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయన్న సంకేతాలతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రద్దీగా మారే అవకాశం ఉంది. పెరిగే భారం నుంచి తప్పించుకునేందుకు చాలా మంది ఏప్రిల్ నెలాఖరు లోపే తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని భావిస్తున్నారు. స్లాట్ల బుకింగ్ కోసం జనం ఎగబడే అవకాశం ఉండటంతో రిజిస్ట్రేషన్ శాఖ కూడా అప్రమత్తమైంది.

# అన్న ప్రేమ వ్యవహారంలో చిక్కుకుని మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**వికారాబాద్: పెన్ పవర్:** ఎస్పీ కార్యాలయంలో ఏఆర్ కానిస్టేబుల్గా విధులు నిర్వహిస్తూ, స్థానికంగా ఒక గదిలో అద్దెకు ఉంటున్న ధారూరు ప్రాంతానికి చెందిన దేగావత్ తులసీబాయి(23) అనే యువతి అత్మహత్య చేసుకుంది.

మృతురాలి అన్న రాజు ఓ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్గా పనిచేస్తూ, అదే ఆసుపత్రిలో పనిచేస్తున్న మౌనిక అనే యువతిని ఏడాది కాలంగా ప్రేమిస్తూన్నాడు. ఆమెను తన చెల్లి గదిలోనే ఉంచాడు.

ప్రేమికుల మధ్య గొడవలు జరిగి మౌనిక వెళ్లిపోయింది. అయితే గతంలో దిగిన ఫోటోలు పంపి మౌనికను రాజు బెదిరిస్తున్నాడు. దీంతో రాజు తనను వేధిస్తున్నాడని అందుకు అతని కానిస్టేబుల్ చెల్లి కూడాసహకరిస్తుందని మౌనిక వికారాబాద్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. తన అన్న ప్రేమ వ్యవహారం వల్ల తాను ఇబ్బంది పడాల్సి వస్తుందని మనస్తాపంతో తులసిబాయి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తులసీబాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫెయిలవుతాననని తనువు చాలించింది కానీ.. పాసయింది..

**మెదక్: పెన్ పవర్:** పదవ తరగతి స్ ఫలితాల్లో ఫెయిల్ అవుతానని భయంతో బాలిక ఆత్మహత్య చేసుకుంఇ. ఫలితాల్లో బాలికకు 1ర్ క్లాస్ మార్కులు వచ్చాయి. మెదక్ జిల్లా పాడ్చన్పల్లి గ్రామంలో పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయంతో సాయి ప్రియ ఈ నెల 24వ తేదీన ఆత్మహత్య చేసుకుంది. బుధవారం విడుదలైన ఫలితాల్లో బాలికకు 480 మార్కులు వచ్చాయి. దాంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయారు.

# తెలంగాణలో భారీగా నిరుద్యోగం

**హైదరాబాద్, ఏప్రిల్ 30, పెన్ పవర్:**
ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఆందోళనకరంగా మారింది. ప్రముఖ ఫైనాన్షియల్ సంస్థ బజాజ్ బ్రోకింగ్, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఎకనామిక్ సర్వే 2025–26' ఆధారంగా ఒక నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.9 శాతానికి చేరుకొని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.దేశ సగటు నిరుద్యోగిత రేటు 5.2 శాతంగా ఉండగా, తెలంగాణలో అది అంతకంటే 3.7 శాతం ఎక్కువగా ఉంది. ఏపీ (8.2%), కర్ణాటక (8.0%) వంటి పొరుగు రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో నిరుద్యోగం అధికంగా నమోదైంది.2022లో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నిరుద్యోగిత రేటు కేవలం 0.7 శాతంగా ఉండేదని, అప్పట్లో ఉపాధి కల్పనలో రాష్ట్రం దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నివేదిక గుర్తు చేస్తోందిగత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున 2,037 ఉద్యోగ నియామకాలు జరగగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గత రెండున్నరేళ్లలో ఆ వేగం తగ్గి నెలకు సగటున 566 నియామకాలకు పరిమితమైందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు రాకపోవడం, ఉన్న ఉద్యోగాల్లో కోతలు

నిరుద్యోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఆశించిన స్థాయిలో రాకపోవడం , జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం కారణంగానే రాష్ట్రంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కవిత ఖాతాలోకి 'టీఆర్ఎస్' బ్రాండ్.. అధికారికంగా ఆమోదించిన ఎన్నికల సంఘం!




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయ యవనికపై ఒక సంచలనాత్మక మార్పు చోటుచేసుకుంది. దశాబ్దాల పాటు తెలంగాణ సెంటిమెంట్‌కు మారుపేరుగా నిలిచిన 'టీఆర్ఎస్' పేరు ఇప్పుడు సరికొత్త రూపంలో కొత్త నాయకత్వంలోకి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు సారథ్యంలో ఉద్యమ కాలం నుండి అధికార పీఠం వరకు వెలిగిన ఈ పేరు, ఇప్పుడు ఆయన కుమార్తె, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హస్తగతమైంది.

**ముగిసిన సస్పెన్స్... 'టీఆర్ఎస్' కవిత సొంతం**

గత కొంతకాలంగా కవిత తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే ఆమె కొత్త పార్టీని స్థాపించే దిశగా అడుగులు వేశారు. గత వారం ఆమె తన పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. అయితే ఇప్పటికే 'బీఆర్ఎస్'గా ఉన్న గులాబీ పార్టీ నాయకత్వం ఈ పరిణామాలను తేలికగా తీసుకుంది. 'టీఆర్ఎస్' అనే పేరును ఇతరులకు కేటాయించడం సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు ధీమా వ్యక్తం చేశాయి.

కానీ కేంద్ర ఎన్నికల సంఘం అనూహ్య నిర్ణయం తీసుకుంటూ కవిత దరఖాస్తును ఆమోదించింది. ఆమె పార్టీని అధికారికంగా 'తెలంగాణ రక్షణ సమితి' పేరుతో నమోదు చేస్తూ దానికి సంక్షిప్త నామంగా 'టీఆర్ఎస్'ను కేటాయించింది. దీనితో తెలంగాణ రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన బ్రాండ్ నేమ్ ఇప్పుడు కవిత ఖాతాలోకి చేరింది.

**బీఆర్ఎస్‌కు కోలుకోలేని దెబ్బ?**

జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలనే లక్ష్యంతో కేసీఆర్ తన పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సమితి' నుండి 'భారత రాష్ట్ర సమితి' (బీఆర్ఎస్)గా మార్చారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మళ్లీ పాత పేరు (టీఆర్ఎస్) వైపు వెళ్తే బాగుంటుందని పార్టీలో అంతర్గత చర్చలు జరిగాయి. తెలంగాణ ప్రజలతో పెనవేసుకుపోయిన ఆ సెంటిమెంట్ పేరును మళ్లీ దక్కించుకోవాలని బీఆర్ఎస్ భావిస్తున్న తరుణంలో కవిత ఆ పేరును రిజిస్టర్ చేయించుకోవడం రాజకీయంగా పెద్ద ట్విస్ట్‌గా మారింది. ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీకి పాత పేరును తిరిగి పొందే మార్గం పూర్తిగా మూసుకుపోయింది.

**కవిత వ్యూహం ఏమిటి?**

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. ఇది కేవలం పేరు మార్పు మాత్రమే కాదు.. తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద చీలికకు లేదా కొత్త ప్రత్యామ్నాయానికి సంకేతం అని చెప్పొచ్చు.. 'టీఆర్ఎస్' పేరుకు గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ తిరుగులేని గుర్తింపు ఉంది. కవిత ఈ పేరును వాడుకోవడం ద్వారా ప్రజల్లోకి సులభంగా వెళ్లవచ్చు. కవిత సొంతంగా పార్టీ పెట్టడం.. అది కూడా పాత పేరుతో రావడం వల్ల బీఆర్ఎస్ క్యాడర్‌లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. కాంగ్రెస్, బీజేపీలకు వ్యతిరేకంగా పోరాడుతూనే తన తండ్రి నిర్మించిన వారసత్వ బ్రాండ్‌ను తన ఖాతాలో వేసుకోవడం ద్వారా కవిత తన స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని చాటుకోవాలని చూస్తున్నారు.తెలంగాణ సిద్ధాంతం, పోరాటం చుట్టూ తిరిగిన 'టీఆర్ఎస్' పేరు ఇప్పుడు కల్వకుంట్ల కవిత చేతిలో కొత్త ఆయుధంగా మారింది. "తెలంగాణ రక్షణ సమితి" పేరుతో ఆమె ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సార్వత్రిక ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి. ఏది ఏమైనా తెలంగాణ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసి, 'టీఆర్ఎస్' పేరుతో కొత్త పోరాటం మొదలైందనేది వాస్తవం.

# ఆ యూస్ లెస్ ఫ్రెండ్ వల్లే నా చదువు సంకనాకింది.. కేటీఆర్ ఫన్నీ కామెంట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చురుకైన నాయకుడిగా.. వాక్చాతుర్యం కలిగిన నేతగా కేటీఆర్ కు ప్రత్యేక గుర్తింపు ఉంది. సాధారణంగా అసెంబ్లీలో అధికార పక్షంపై విమర్శలు సంధించడమో లేదా అభివృద్ధి పనులపై సీరియస్‌గా చర్చించడమో చేసే కేటీఆర్.. తాజాగా తనలోని 'కామెడీ యాంగిల్'ను బయటపెట్టారు. తన కాలేజీ రోజుల్లో జరిగిన ఒక ఆసక్తికరమైన, హాస్యాస్పదమైన సంఘటనను ఓ కాలేజీ ఫంక్షన్ లో పంచుకోవడంతో ఇప్పుడు ఆ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది.



**స్నేహితుడి మాట నమ్మి.. హైదరాబాద్ వదిలి గుంటూరుకు!**

ఈ కథ అంతా కేటీఆర్ ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ చదివే కాలంలో మొదలైంది. అప్పట్లో ఆయన హైదరాబాద్‌లోని ఒక మంచి కాలేజీలో సెటిల్ అయిపోయారు. అయితే అక్కడే అసలు ట్విస్ట్ ఇచ్చాడు ఆయన స్నేహితుడు కళ్యాణ్. "హైదరాబాద్‌లో ఏం ఉందిరా.. గుంటూరు వెళ్దాం పదా, అక్కడ చదువు కంటే ఎంజాయ్‌మెంట్ అదిరిపోతుంది" అని కళ్యాణ్ ఇచ్చిన ఉచిత సలహాతో కేటీఆర్ మైండ్ మారిపోయింది. తన తండ్రి, అప్పటి ఉద్యమ నేత కేసీఆర్‌ను ఎలాగోలా ఒప్పించి, హైదరాబాద్ సుఖాలను వదిలి గుంటూరుకు పయనమయ్యారు. "నా ఫ్రెండ్ చెప్పిన మాటలు విని, గుంటూరులో ఏదో స్వర్గం ఉంటుందని ఊహించుకుని వెళ్లాను" అని కేటీఆర్ నవ్వుతూ ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

**"ఆఫ్ట్రాల్ గుంటూరు ఏంటి?" అన్న ధీమా.. చివరకు షాక్!**

గుంటూరు వెళ్లేటప్పుడు కేటీఆర్ దగ్గర బోలెడంత ఆత్మవిశ్వాసం ఉండేదట. "నాకు హిందీ బాగా వచ్చు, నేను హైదరాబాద్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వచ్చాను, నా లెవల్ వేరు.. ఈ గుంటూరు కాలేజీ ఎంట్రన్స్ టెస్ట్ ఒక లెక్కా?" అన్న ధీమాతో ఏమాత్రం ప్రిపేర్ అవ్వకుండా పరీక్షా హాల్లో కూర్చున్నారు. తీరా ఫలితాలు వచ్చాక చూస్తే.. పరిస్థితి తలకిందులైంది. ఆ ఎంట్రన్స్ టెస్టులో కేటీఆర్‌కు వచ్చింది కేవలం నాలుగు మార్కులు మాత్రమే! ఆ తక్కువ మార్కులు చూసి ఆయనకు నోట మాట రాలేదట. ఆ సమయంలో తన అహం దెబ్బతినడమే కాకుండా ఫలితంపై ఏదో అనబోతే గట్టిగానే చెంపదెబ్బ కూడా దక్కిందని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. దెబ్బకు కళ్ల వెంట నీళు వచ్చాయని తెలిపారు.

**వైరల్ అవుతున్న "సంకా నాకింది" కామెంట్**

ఈ వైఫల్యానికి కారణం తన స్నేహితుడు కళ్యాణ్ అని కేటీఆర్ భావించారు. ఆ కోపంలో ఆయన తన ఫ్రెండ్ ను బండ బూతులు తిట్టాడట.. ఈ మాటలు ఇప్పుడు నెటిజన్లను విపరీతంగా నవ్విస్తున్నాయి. "నా చదువు సంక నాకింది కేవలం ఈ కళ్యాణ్ వల్లే!" అంటూ ఆయన అప్పట్లో తన ఫ్రెండ్‌ను తిట్టుకున్న విధానాన్ని ఇప్పుడు బహిరంగంగా చెప్పడంతో అందరూ నవ్వుల్లో మునిగిపోయారు. ఒకప్పుడు సీరియస్ స్టూడెంట్‌గా, ఇప్పుడు పవర్‌ఫుల్ లీడర్‌గా ఉన్న కేటీఆర్ నోటి నుండి ఇలాంటి పక్కా లోకల్ స్లాంగ్ వినబడేసరికి నెటిజన్లు ఆ వీడియోను విపరీతంగా షేర్ చేస్తున్నారు.

**ఈ కథలో దాగిన సందేశం**

కేటీఆర్ ఈ విషయాన్ని సరదాగా చెప్పినప్పటికీ ఇందులో విద్యార్థులకు ఒక ముఖ్యమైన సందేశం ఉంది. స్నేహితుల మాటలు వినడం మంచిదే కానీ, కెరీర్ విషయంలో గుడ్డిగా వారిని అనుసరించకూడదు. మన బ్యాక్‌గ్రౌండ్ ఏదైనా ఒక పరీక్షను లేదా పోటీని ఎదుర్కొనేటప్పుడు సరైన సిద్ధత లేకపోతే పరాభవం తప్పదు. కాలేజీలో నాలుగు మార్కులు తెచ్చుకున్న విద్యార్థి కూడా పట్టుదలతో కృషి చేస్తే రాష్ట్ర రాజకీయాలను శాసించే స్థాయికి ఎదుగుతారని కేటీఆర్ ప్రయాణం చెబుతోంది. రాజకీయాల్లో ఎప్పుడూ ప్రత్యర్థులపై విమర్శలు, ప్రతి విమర్శలతో బిజీగా ఉండే నేతలు ఇలా తమ వ్యక్తిగత జీవితంలోని 'ఫెయిల్యూర్స్'ను హాస్యంతో కలిపి చెప్పడం వల్ల సామాన్య ప్రజలకు వారు మరింత దగ్గరవుతున్నారు. మొత్తానికి కేటీఆర్ "గుంటూరు గోల" ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ట్రెండింగ్‌లో ఉంది!

# ఏపీకి 11,056 కోట్లు..

## ఇదీ బాబు మార్క్ పరిపాలన.. సంపద..

**విజయవాడ, ఏప్రిల్ 30 పెన్ పవర్:** ఒక ఎకో సిస్టం డెవలప్ కావాలంటే అక్కడ అనుకూల పరిస్థితులు సృష్టించాలి. అవి సృష్టించాలంటే అక్కడి నాయకత్వానికి దూర దృష్టి ఉండాలి. అలాంటి దూర దృష్టి ఉన్న నాయకుడు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయగలడు. దానికోసం అవకాశాలను సృష్టించగలడు. అంతిమంగా ఆ ప్రాంతాలను గొప్పగా వృద్ధి చేయించగలడు. అలాంటి నాయకుడే ఇప్పుడు ఏపీకి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన దార్శనికత వల్ల ఏపీ కథ మొత్తం మారిపోయింది.ఏ ప్రభుత్వానికైనా ఆదాయం అత్యంత అవసరం. ఎందుకంటే ఆదాయం ఉంటేనే అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యమవుతుంది. సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలవుతుంది. ఆదాయం రావాలంటే ప్రజల్లో నమ్మకం పెరగాలి. కొనుగోలు శక్తి పెరగాలి. అప్పుడే ఆర్థిక వృద్ధి.. అభివృద్ధి సాధ్యమవుతుంది.. ఏపీ రాష్ట్రంలో ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.. ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు ఏపీ రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమే ఉండేది. అప్పులు మాత్రం దారుణంగా ఉండేది. ఈ క్రమంలో నాశనమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తన అనుభవాన్ని మొత్తం రంగరించారు. ఫలితంగా ఏపీ రాష్ట్ర అభివృద్ధి బాట పట్టింది.ఏపీ రాష్ట్రానికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయాన్ని పరిశీలనకు తీసుకుంటే.. గత ఆర్థిక సంవత్సరం అద్భుతమైన వృద్ధి కనిపించింది. అంతకుముందు ఏడాదితో పోల్చి చూస్తే ఇది ఏకంగా 25% ఎక్కువ. బడ్జెట్ అంచనాలను దాదాపు 98.4% సాధించింది. 2024-2025లో 8, 847 కోట్లుగా ఉన్న ఆదాయం.. 2025-26 లో 11,056 కోట్లకు చేరుకుంది. డిజిటల్ విధానం, పరిపాలన సంస్కరణల వల్ల రిజిస్ట్రేషన్ల ఆదాయంలో పెరుగుదల కనిపించింది.. ఈ స్థాయిలో ఆదాయం సాధించడం అంటే మామూలు విషయం కాదు.. పైగా ఇంతటి వృద్ధి అన్ని రకాల వసతులు ఉన్న రాష్ట్రాల్లో కూడా సాధ్యం కాలేదు. కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టడం.. రాజధాని నగరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతూ ఉండడం.. ప్రభుత్వపరంగా సానుకూల నిర్ణయాలు కనిపిస్తూ ఉండడంతో.. ఏపీ రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం అమాంతం దూసుకుపోయింది.. ఇదే జోరు గనుక కొనసాగితే వచ్చే రోజుల్లో కూడా ఆదాయం మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు"ఆంధ్రప్రదేశ్లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఒకప్పటి మాదిరిగా ఒత్తిడి లేదు. అన్ని అనుమతులు త్వరగానే వస్తున్నాయి. భూమి కేటాయింపులు కూడా జరిగిపోతున్నాయి.. ప్రభుత్వం రంగంలోకి దిగి అన్ని రకాల అనుమతులు త్వరగానే లభించేలా చేస్తుంది. ముఖ్యంగా డిజిటల్ విధానంలో భూ వ్యవహారాలు సాగుతున్నాయి. దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోతున్నాయి. ఇవి మార్పునకు సంకేతంగా



కనిపిస్తున్నాయని" భూములు కొనుగోలు చేస్తున్న వారు అంటున్నారు.

**గ్లోబల్ క్యాపిటల్ గా విశాఖ**

విశాఖపట్నం ప్రాంతాన్ని పర్యాటకంగానే ఇప్పటిదాకా చూశారు. అయితే ఆ నగరంలో మరో కోణాన్ని చూశారు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. అందువల్లే ఈ ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి ఆయన శ్రీకారం చుట్టారు. 2014 నుంచి 2019 వరకు విశాఖపట్నంలో విస్తృతంగా రోడ్లను నిర్మించారు. ఐటీ కార్యకలాపాలకు విశాఖపట్నం అనుకూలంగా ఉంటుందని కార్పొరేట్ కంపె,,లకు సంకేతాలు పంపించారు. దీంతో మనదేశంలో పేరుపొందిన కంపెనీలు శాఖలను ఏర్పాటు చేశాయి. 2019లో ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఐటీ కార్యకలాపాలు మందగించాయి.మళ్లీ ఇప్పుడు ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం రూపు రేఖలు మారిపోతున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా ఐటీ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఇప్పటికాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా పనిచేసే డేటా సెంటర్లు కూడా విశాఖపట్నంలో ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి తోడు క్లౌడ్ కంప్యూటింగ్ విభాగంలో కూడా విశాఖపట్నం అగ్రగామిగా వెలుగొందడానికి అడుగులు వేస్తోంది. విశాఖపట్నంలో మౌలిక వసతులు పెరిగిపోవడం.. భూములు ఇవ్వడానికి రైతులు ముందుకు రావడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధి పరుగులు పెడుతోంది..చంద్రబాబు విశాఖపట్నం గ్లోబల్ క్యాపిటల్ గా మార్చడానికి అడుగులు వేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారు. ఇప్పుడు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో ఐటీ ఆధారిత కార్యకలాపాలు సాగడానికి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం కి గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి ఆ మధ్య జరిగిన ప్రపంచం పెట్టుబడిదారుల సదస్సులను ఉపయోగించుకున్నారు. ఈ క్రమంలోనే విశాఖపట్నంలో గూగుల్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అనుకూల పరిస్థితులు కల్పించారు. కేంద్రంలో ఎలాగూ సపోర్ట్ ఉంది కాబట్టి.. చంద్రబాబు గూగుల్ ప్రతినిధులతో మంతనాలు జరపడం ఈజీ అయిపోయింది.ఐటీ మంత్రిగా నారా లోకేష్ తెరమందు ప్రయత్నాలు మొత్తం చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను సరళీకృతం చేశారు.

ప్రపంచ పెట్టుబడిదారులకు గుమ్మంగా విశాఖపట్నం ఎందుకు ఉంటుందో పదేపదే వివరించే ప్రయత్నం చేశారు. దీనికి తోడు భూముల కేటాయింపు నుంచి మొదలుపెడితే అనుమతుల వరకు ప్రతి విషయంలోనూ ఆయన చొరవ తీసుకున్నారు. అందువల్లే గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చింది. గూగుల్ సంస్థ రావడంతో.. రిలయన్స్.. అదాని.. మిట్టల్ వంటి సంస్థలు కూడా వచ్చేశాయి. ఇవన్నీ కూడా ఒక విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల కోట్లకు మించి పెట్టుబడులు పెడుతున్నాయి. దీనిని బట్టి విశాఖపట్నం నగరానికి భవిష్యత్తు కాలంలో ఏ స్థాయిలో డిమాండ్ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.. ఒక బిజినెస్ ఏర్పాటు కావాలంటే దానికి అనుకూల పరిస్థితులు ఉండాలి. ఆ పరిస్థితులను చంద్రబాబు కల్పించారు కాబట్టి.. విశాఖపట్నం గ్లోబల్ కాపిటల్ గా మారబోతోంది.

# మావిగన్ తో జగన్ కు బంపర్ మైలేజ్



**విజయవాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:** వైసీపీ ట్రెడిషనల్ పాలిటిక్స్ కి దూరంగా ఉండే పార్టీ. ఒక భిన్నమైన వైఖరితో సాగే పార్టీ. ప్రచారం విషయంలో చూస్తే ఆ పార్టీ తీరే వేరుగా ఉంటుంది. అవతల ప్రత్యర్థి టీడీపీ అయితే పబ్లిసిటీ విషయంలో చాలా స్పీడ్ గా ఉంటుంది. పైగా వ్యూహాలు ఎత్తుగడలలో టీడీపీని మించిన వారు ఉండరు. అలాంటి పార్టీతో వైసీపీ ఎపుడూ పోటీ పడలేని స్థితిలోనే ఉంటుంది. అలాంటివి వైసీపీ మావి గన్ అన్న ఒకే ఒక్క స్టెప్ తో ఏకంగా వంద కోట్ల రూపాయిల విలువ చేసే పబ్లిసిటీని ఫ్రీగా కొట్టేసిందా అన్న చర్చ అయితే సాగుతోంది. మావిగన్ అన్నది వైసీపీ కాకతాళీయంగా అన్నదా లేక మనసులో ఉంచుకుని సరైన సమయంలో వదిలిన పంచ్ నా లేక టీడీపీ కూటమి అమరావతి రాజధాని అన్న బలమైన స్లోగన్ ని ఎంతో కొంత అడ్డుకునేందుకు వేసిన పాచికా అన్నది తెలియదు కానీ మావిగన్ మాత్రం జగన్ నోటి వెంట రాగానే సోషల్ మీడియా మొత్తం షేక్ అయింది. అంతే కాదు ఏపీ రాజకీయమంతా మొదట షాక్ అయింది ఆ మీదట హీటెక్కిపోయింది. ఇక మావిగన్ అన్నది ట్రెండింగ్ లో ఉంటూ ట్రోలింగ్ కా బాప్ అనిపించుకుంది. ఇది నెగిటివ్ ప్రచారమా లేక పాజిటివ్ ప్రచారమా అన్నది పక్కన పెడితే వైసీపీని ఎక్కడో తీసికెళ్ళి పెట్టింది అన్నది మాత్రం వాస్తవం అని అంతా అంటున్నారు. వైసీపీ అధినేత 2017 లో నిర్వహించిన భారీ పాదయాత్ర సమయంలో వైసీపీకి వచ్చిన హైప్ పొలిటికల్ గా హైలెట్ అయిన తీరు అందరికీ తెలిసిందే. ఆ తరువాత అంతటి పొలిటికల్ వైబ్రేషన్స్ అయితే వైసీపీకి ఎక్కడా రాలేదు. అధికారంలో ఉన్నపుడు కానీ గడచిన రెండేళ్ళ విపక్ష పాత్రలో కానీ వైసీపీ డిఫెన్స్ మోడ్ లో ఉంటోంది. చాలా సార్లు సైలెంట్ మోడ్ నే నమ్ముకుంది. ఇక అనేక సార్లు కార్నర్ అవుతూ వస్తోంది. కానీ ఇన్నేళ్ళ తరువాత మళ్లీ నాటి హైప్ వైసీపీకి క్రియేట్ అయింది అంటే దానికి వన్ అండ్ ఓన్లీ రీజన్ మావిగన్ అని అంటున్నారు. మావిగన్ అన్న మూడు అక్షరాల పదం వైసీపీని పొలిటికల్ గా ఏపీ రాజకీయ తెర మీద ఫుల్ ఫోకస్డ్ గా నిలిచేలా చేసింది అని అంటున్నారు. ఇక దీని మీద జరిగిన చర్చ ఇంతా అంతా కాదు అది పాజిటివ్ గా జరిగిందా లేక నెగిటివ్ గా జరిగిందా అన్నది పక్కన పెడితే వైసీపీ అన్న పేరు ప్రతీ చోటా నానేలా చేసింది. ఆ విధంగా చూస్తే ఏప్రిల్ నెల మొదటి తేదీన వైసీపీ అధినేత జగన్ వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రెస్ మీట్ పెట్టారు. ఆ రోజున ఆయన మావిగాన్ అని ప్రతిపాదించారు. అంతే నాటి నుంచి దాదాపుగా నెల రోజులుగా అదే సోషల్ మీడియాలో తెగ ట్రెండింగ్ అవుతోంది. ఎంతలా అంటే మరే టాపిక్ కూడా కనీసంగా చర్చకు నోచుకోనంతగా ఈ ఒక్క టాపిక్ తోనే వైసీపీ బహుళ ప్రచారం పొందింది. నిజం చెప్పాలంటే ఈ సమయంలో అంటే వైసీపీ భారీ ఓటమిని అందుకుని విపక్షంలో ఉంటూ కేవలం 11 సీట్లతో చతికిలపడిన వేళ ఆ పార్టీ రాజకీయంగా ఇబ్బందులు పడుతున్న వేళ వచ్చిన ఈ బూస్టింగ్ కానీ జరిగిన ప్రచారం కానీ రూపాయలలో లెక్క కడితే కచ్చితంగా వంద కోట్ల పై మాటే అంటున్నారు. అంటే పార్టీ ఖజానా నుంచి వంద కోట్లు తీసి పబ్లిసిటీ చేయించుకుంటే వచ్చే పబ్లిసిటీ ఫ్రీగానే వచ్చేసింది అన్న మాట. ఈ ప్రచారం అంతా మీడియానే మోసింది. భారీగా చేసింది. అది మెయిన్ స్ట్రీమ్ మీడియానా లేక సోషల్ మీడియానా లేక డిజిటల్ ఫ్లాట్ ఫారం నా అన్నది పక్కన పెడితే ఒక్క మావిగన్ తో వైసీపీ అచ్చంగా ఉచిత ప్రచారాన్ని వందల కోట్ల దాకా పొందేసింది. ఇందులో జనాలదే తొంబై శాతం పాత్ర అయితే వైసీపీ నుంచి మావిగాన్ ని సమర్థించుకుంటూ చేసిన ప్రచారం కేవలం పది శాతం మాత్రమే. అంటే ఇంతలా ఇది ప్రచారం అవుతుందని బహుశా వైసీపీ కూడా ఊహించి ఉండదు ఏది ఏమైనా వైసీపీకి ఈ సమయంలో అయితే ఇది బాగా జనంలో ఫోకస్ అయ్యేలా చేసింది మరి ఇది పాజిటివ్ గానా నెగిటివ్ గానా అన్నది పక్కన పెడితే ఒక రాజకీయ పార్టీకి కావాల్సినంత ప్రచారం అయితే దక్కింది. ఆ విధంగా వైసీపీ లక్కీ అనే అంటున్నారు.

# సొంత నియోజకవర్గాలపై దృష్టి

**విజయవాడ, ఏప్రిల్ 30 పెన్ పవర్:** ఎన్నికలకు రెండున్నర సంవత్సరాలకు పైగా సమయం ఉంది. పైగా వారంతా సిట్టింగ్ ఎమ్మెల్యేలే. అయినప్పటికీ వచ్చే ఎన్నికలపై ఇప్పటి నుంచే కొందరు ఎమ్మెల్యేలు దృష్టి పెట్టారు. గత ఎన్నికల్లో తమ సొంత ప్రాంతాలను కాదని వేరే ప్రాంతాలకు వెళ్లి వేరే నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేశారు. దీంతో ఇప్పుడు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో.. వచ్చే ఎన్నికల్లో కూడా పోటీ చేస్తే తమ పరిస్థితి ఏమిటి అన్నది కొంతమంది ఎమ్మెల్యేలకు దిగులు పట్టుకుంది. ఇది వాస్తవం కూడా. గత ఎన్నికల్లో అంటే కూటమి ప్రభావం ఉంది. వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత కూడా ఉంది. కాబట్టి ఎవరు పోటీ చేశారు.. ఎవరు నిలబడ్డారు.. అన్నది కూడా కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్లు గమనించలేదు. కేవలం పార్టీ గుర్తులు, పార్టీ అధినేతలను చూసి వారు ఓటేశారు. కానీ వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి రిపీట్ అవుతుందా అంటే కష్టం. ఎందుకంటే ఐదు సంవత్సరాల పరిపాలన కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఎంతో కొంత వ్యతిరేకత ఏ ప్రభుత్వం పైన అయినా ఉంటుంది. దీనికి చంద్రబాబు మాత్రం అతీతులు కారు. గత 2019 ఎన్నికల్లో ఓడిపోయిన విషయం గుర్తుండే ఉంటుంది కదా. ఈ నేపథ్యంలో ఇప్పుడు చాలామంది ఎమ్మెల్యేలు తమ తమ సొంత నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు. తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒకవైపు పనులు చేస్తూనే.. ఎందుకైనా మంచిది అని తమ సొంత నియోజకవర్గాలపై ఒక అడుగు వేశారు. ఇటువంటి వారిలో మాజీ మంత్రులు ఉన్నారు. సీనియర్ నాయకులు కూడా ఉన్నారు. వీరంతా తరచుగా తమ తమ సొంత నియోజకవర్గంలో పర్యటించడంతోపాటు అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా తమ అనుచరుల ద్వారా తెలుసుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేలపై ఉన్న వ్యతిరేకతను వీరు నిరంతరం తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నారు. తద్వారా వచ్చే ఎన్నికల్లో తమ సొంత నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ గ్రాఫ్ ఏ విధంగా ఉంటుందన్న విషయాన్ని ఇప్పటినుంచి లెక్కలు కట్టుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈ జాబితాలో మాజీ మంత్రి ప్రస్తుతం ఎమ్మెల్యే కళా వెంకట్రావుతో పాటు సీనియర్ నాయకులు, జూనియర్ ఎమ్మెల్యేలు ఇలా అనేకమంది ఉన్నారు. వీరందరి లక్ష్యం.. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించటం. అయితే తమది కానీ నియోజకవర్గంలో మళ్లీ పోటీ చేస్తే వ్యతిరేకత మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇది తమకు మైనస్ గా మారుతుందని భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు తమ తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి పోటీ చేసి మరోసారి గెలుపు గుర్రం ఎక్కి దిశగా ఆలోచన చేస్తున్నారు. అప్పుడు ఎంత వ్యతిరేక ప్రభావం ఉన్నప్పటికీ.. సొంత నియోజకవర్గంలో సొంత అనుచరులు సొంత సామాజిక వర్గం తమకు సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. మరి దీనికి ఎటువంటి పరిస్థితులు వస్తాయి.. పార్టీ అధినేత చంద్రబాబు ఏ విధంగా నిర్ణయం తీసుకుంటారు అనేది చూడాలి.

# సొంత ఇమేజ్ పై దివ్యదృష్టి...

**కాకినాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:** రాజకీయాల్లో వారసత్వాలకు కొదవలేదు. అది పురుషులైనా మహిళలైనా ఇటీవల కాలంలో రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ పొలిటికల్ కెరీర్ను ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇటువంటి వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని తుని నియోజకవర్గం ఎమ్మెల్యే కీలకమని చెప్పాలి. గత ఎన్నికల్లో తుని నియోజకవర్గ నుంచి మాజీ మంత్రి సీనియర్ మోస్ట్ నాయకుడు యనమల రామకృష్ణుడి కుమార్తె యనమల దివ్య పోటీ చేశారు.. విజయం కూడా దక్కించుకున్నారు. నిజానికి వైసీపీ ఇక్కడ బలంగా ఉంది. స్థానికంగా కూడా వివాదరహితంగా వైసిపి గత ఎన్నికల సమయంలో వ్యవహరించింది. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ తునిలో వైసీపీ విజయం సాధిస్తుందని చాలామంది అంచనా వేశారు. కానీ దీనికి భిన్నంగా తుని పొలిటికల్ తెరపై తొలిసారి యనమల రామకృష్ణుడి కుమార్తె దివ్య విజయం సాధించారు. పైగా ఆ సమయంలో సొంత కుటుంబంలోనే రెండు వర్గాలుగా ఏర్పడిన పరిస్థితి ఉంది, యనమల రామకృష్ణుడు సోదరుడు యనమల కృష్ణుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. టిడిపి ఓటు బ్యాంకు చీల్చే ప్రయత్నం చేశారని పెద్ద ఎత్తున చర్చ కూడా సాగింది. యనమల దివ్య ఘన విజయం దక్కించుకున్నారు. నియోజకవర్గంలో ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఇప్పుడు రెండు సంవత్సరాలు గడిచిపోయిన తర్వాత మరి ఆమె పరిస్థితి ఏ విధంగా ఉంది.. నియోజకవర్గం అభివృద్ధి.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు ప్రజలకు అందుతున్న లబ్ధి వంటివి ఏ మేరకు దివ్యకు పేరు తీసుకు వస్తున్నాయి.. అనేది చూస్తే సానుకూల పరిణామాలే కనిపిస్తున్నాయని స్థానిక రాజకీయ నాయకులు చెబుతున్నారు.గత ఎన్నికల వరకు యనమల రామకృష్ణుడి పేరుతోనూ యనమల కుటుంబం పేరుతో రాజకీయాలు చేసిన దివ్య ఇప్పుడు సొంతంగానే తన ఇమేజ్ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి తోడు వైసిపి తరఫున కార్యక్రమాలు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనిపించని పరిస్థితి ఉంది. ఇది దివ్యకు మరింతగా కలిసి వచ్చింది. వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతురాలు అయిన దివ్య సమస్యలను పరిష్కరించే విషయంలోనూ అధికారులను ముందుకు నడిపించే విషయంలోనూ చాలా విజ్ఞతతో వ్యవహరిస్తున్నారు. ఆమె వేస్తున్న అడుగులు మంచి ఫలితాన్ని అందిస్తున్నాయి. ఎక్కడ ఎమ్మెల్యే పై వ్యతిరేకత కనిపించడం లేదు. సొంత పార్టీలోనూ కలివిడితనం స్పష్టంగా ఉంది. అయితే క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కలుపుకుని వెళ్లే విషయంలో ఎమ్మెల్యే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించాలి. నియోజకవర్గంలో అభివృద్ధి విషయాన్ని పరిశీలిస్తున్నప్పటికీ వ్యక్తిగత అంశాల విషయంలో కార్యకర్తల నుంచి వస్తున్న విజ్ఞాపనలను కూడా ఆమె పరిశీలనలోకి తీసుకుంటే వచ్చే ఎన్నికల్లో వరుసగా విజయం సాధించేందుకు అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుకు అందిన ఎమ్మెల్యేల రిపోర్టులో దివ్య తొలి 100 స్థానాల్లోనే ఉండడం విశేషం.

# కొంప ముంచుతున్న కృత్రిమ కొరత

**కాకినాడ, ఏప్రిల్ 30, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్, డీజిల్ కొరత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. విపక్షసీపీఆయకులునిపై నిరసనలు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఏపీలో ఈ పరిస్థితి నెలకొందని మాజీ సీఎం జగన్ విమర్శించారు. పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి కొరత లేదని కూటమి అధికారంలో ఉన్న ఏపీలో మాత్రం ప్రజలకు పెట్రోల్, డీజిల్ దొరకడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అయితే సమస్యకు ప్రధాన కారణాలు పానిక్ కొనుగోళ్లు, సరఫరా ఆలస్యాలు, పరిశ్రమల డిమాండ్ మార్పులు అని అధికారులు చెబుతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా 4,500కి పైగా పెట్రోల్ బంకుల్లో 10--70 శాతం మూతపడ్డాయి. కర్నూలు, నంద్యాల్, గోదావరి, విశాఖలో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. రోజువారీ 6,330 కిలో లీటర్ల పెట్రోల్, 9 వేల కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలకు 50 శాతం అధిక డిమాండ్ ఏర్పడటంతో సంక్షోభం తీవ్రమైంది. దొరకదనే కారణంతో చాలా మంది అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు.పానిక్ భయంతో అనవసర కొనుగోళ్లు పెరగడం కొరతకు ప్రధాన కారణం. సాధారణ అమ్మకాలకు రెట్టింపు డిమాండ్ వచ్చింది. పారిశ్రామికులు అధిక ధరల కారణంగా రిటైల్ డీజిల్కు మారారు, వ్యవసాయ రంగంలో కూడా డిమాండ్ పెరిగింది. యుద్ధాలు, ఆయిల్ కంపెనీల రెండు రోజుల ఆలస్య సరఫరా, క్రెడిట్కు బదులు క్యాష్ డిమాండ్ కృత్రిమ కొరతను మరింత పెంచాయి.సీఎం చంద్రబాబు పరిస్థితిపై సమీక్షలు నిర్వహించారు. అధిక సరఫరా కోరారు. . మంత్రి నాదెండ్ల మనోహర్ కొరత లేదని, పోయోకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రైవేటు సంస్థల సరఫరా ఆగిపోవడంపై కూడా చర్చించారు.పానిక్ కొనుగోళ్లు తగ్గిస్తే సమస్య త్వరగా సద్దుమణుగుతుంది. ఆయిల్ కంపెనీలు సరఫరాను మెరుగుపరచాలి, పరిశ్రమలకు ప్రత్యేక సరఫరా ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం డీలర్లను పరిగణనలోకి తీసుకుని, పారదర్శకత పెంచాలి.

**పొలిటికల్ మైలేజ్ కోసం వైసీపీ**

ప్రజా సమస్యల పట్ల పోరాడాల్సిన అవసరం ప్రతిపక్ష పార్టీకి ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టాల్సిన బాధ్యత కూడా ప్రతిపక్ష పార్టీ మీద ఉంటుంది. కానీ ఏపీలో ఇందుకు విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. 2024 ఎన్నికల్లో అక్కడ కూటమి జోరు ముందు వైసిపి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. ప్రతిపక్ష హోదా కోసం అడుక్కోవలసిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడింది.. ఏపీలో కూటమి ప్రభుత్వానికి సమాంతరంగా మరో పార్టీ లేదు కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ అక్కడ తుడిచి పెట్టుకుని పోయింది కాబట్టి.. వైసిపి నే అనధికారికంగా ప్రతిపక్ష హోదాలో ఉంది. ఆ పార్టీ అధ్యక్షుడిగా జగన్మోహన్ రెడ్డి ఉన్నారు.జగన్మోహన్ రెడ్డి ఆ మధ్య రైతుల సమస్యల మీద ధర్నాలు చేశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఒక అనధికారిక ప్రతిపక్ష నాయకుడిగా అది ఆయనకు లభించిన గౌరవం. ఆయన ఆ పని చేయాలి కూడా.. కాకపోతే ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని చెప్పి ప్రభుత్వంపై అడ్డగోలుగా విమర్శలు చేస్తే జనం అసలు సహించరు.ప్రస్తుతం మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కొనసాగుతోంది. ఇప్పటికీ ఇరాన్ హార్మోజ్ జలసంధి విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఆ జల సంధి మీదుగా సరుకు రవాణా కావడం లేదు. యుద్ధం నిలిపివేతకు సంబంధించిన చర్చలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. కేవలం మన దేశం మాత్రమే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు మధ్య ఆసియా ప్రాంతంలో జరుగుతున్న యుద్ధం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయి. ఇప్పటికే బ్యారెల్ ముడి చమురు ధర పెరిగింది. ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. తగిన ఇంధన నిల్వలు ఉన్న నేపథ్యంలో కంపెనీలు కూడా పెద్దగా రేట్లు పెంచలేదు. అయితే కమర్షియల్ డీజిల్ ధర పెరిగిన నేపథ్యంలో.. మిగతా డీజిల్ కు డిమాండ్ పెరిగింది. పైగా ఆయిల్ కంపెనీలు సప్లై తగ్గించాయి. దీంతో డిమాండ్ పెరిగిన నేపథ్యంలో బంకుల వద్ద ప్రజల క్యూలు కడుతున్నారు. ఇదే క్రమంలో పానిక్ బయింగ్ పరిస్థితి ఏర్పడింది. ఇది దేశం మొత్తం మీద ఉంది.ఈ పరిస్థితికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కారణమని ట్విట్టర్లో ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోపించారు. పైగా ఒక వీడియోను విడుదల చేశారు. వాస్తవానికి ప్రపంచ వ్యాప్తంగా విపత్కర పరిస్థితి ఉంటే చంద్రబాబు ఏం చేస్తారు.. చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల ఏపీలో ఇంధన కొరత ఏర్పడిందని జగన్మోహన్ రెడ్డి ఆరోపించడం ఎంతవరకు న్యాయం.. అసలు ఇలాంటి సమయంలో రాజకీయాలు చేయడం అవసరమా.. ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలు చేస్తారా.. ఇప్పుడు ఇవే ప్రశ్నలను కూటమి నేతలు సంధిస్తున్నారు..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# టీనేజీ బాలిక అబార్షన్ కేసు : మీ చట్టాలను మార్చండి అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో అత్యాచార బాధితుల హక్కులు.. ముఖ్యంగా మైనర్ బాలికల ఆరోగ్యం, వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు గురువారం ఒక చారిత్రాత్మకమైన, సంచలనమైన వ్యాఖ్యలు చేసింది. 15 ఏళ్ల అత్యాచార బాధితురాలికి సంబంధించిన గర్భవిచ్ఛిత్తి (అబార్షన్) కేసును విచారించిన అత్యున్నత న్యాయస్థానం, మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన పాత చట్టాలను పునఃసమీక్షించాలని, అవసరమైతే సమూల మార్పులు చేయాలని స్పష్టం చేసింది.

**కేసు నేపథ్యం.. కోర్టు అనుమతి**

కేసు వివరాల్లోకి వెళ్తే.. ఒక 15 ఏళ్ల బాలిక అత్యాచారానికి గురై సుమారు 30 వారాల గర్భంతో గర్భవిచ్ఛిత్తి కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. భారతీయ చట్టాల ప్రకారం , నిర్ణీత పరిమితి దాటిన తర్వాత గర్భవిచ్ఛిత్తికి న్యాయపరమైన అనుమతి తప్పనిసరి. ఈ క్రమంలో గత విచారణలో సుప్రీంకోర్టు స్పందిస్తూ, "ఒక మహిళను అందులోనూ ఒక మైనర్ బాలికను ఆమె ఇష్టానికి విరుద్ధంగా గర్భాన్ని కొనసాగించమని బలవంతం చేయడం అత్యంత అమానవీయం" అని పేర్కొంటూ గర్భవిచ్ఛిత్తికి పచ్చజెండా ఊపింది.

**ఎయిమ్స్ అభ్యంతరం.. న్యాయస్థానం స్పందన**

అయితే ఈ తీర్పుపై ఢిల్లీలోని ఎయిమ్స్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ క్యూరేటివ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఎయిమ్స్ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపిస్తూ.. 30 వారాల గర్భం అంటే అది దాదాపు పూర్తి స్థాయికి చేరుకున్నట్లేనని, ఈ దశలో అబార్షన్ చేయడం వల్ల బాలిక ప్రాణాలకే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు వారాలు వేచి చూస్తే, బిడ్డకు జన్మనిచ్చి, ఆ తర్వాత ఆ శిశువును దత్తతకు ఇచ్చే వెసులుబాటు ఉంటుందని వారు సూచించారు. ఈ వాదనలపై సుప్రీంకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. కేవలం వైద్య పరమైన కోణంలోనే కాకుండా, బాధితురాలి మానసిక , సామాజిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. "ఆ బాలిక ఎదుర్కొన్నది సాధారణ గర్భం కాదు, అది అత్యాచారం వల్ల కలిగిన ఫలితం. ఆ దారుణ ఘటన ఆమెను జీవితాంతం మానసిక క్షోభకు గురిచేస్తుంది. అటువంటి పరిస్థితుల్లో గర్భాన్ని మోయమని ఆమెను ఒత్తిడి చేయడం ఆమె ప్రాథమిక హక్కులను కాలరాయడమే అవుతుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**చట్టాల్లో మార్పులు అవసరం.. కేంద్రానికి సూచన**

ఈ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత ఎంటీపీ యాక్ట్ లో ఉన్న నిబంధనలు అత్యాచార బాధితుల పట్ల కఠినంగా ఉన్నాయని అభిప్రాయపడింది. ముఖ్యంగా ప్రస్తుత చట్టంలోని 20 లేదా 24 వారాల గర్భవిచ్ఛిత్తి పరిమితిని, అత్యాచార బాధితుల విషయంలో ప్రత్యేక వెసులుబాటుతో పెంచేలా మార్పులు చేయాలి. గర్భవిచ్ఛిత్తి నిర్ణయం తీసుకునేటప్పుడు కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాకుండా, బాధితురాలి మానసిక స్థితిని ప్రధాన ప్రాతిపదికగా తీసుకోవాలి. ఈ విషయంలో తుది నిర్ణయాన్ని బాధితురాలు ఆమె తల్లిదండ్రులకే వదిలేయాలని, వారికి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలని కోర్టు స్పష్టం చేసింది.వైద్యుల నివేదిక ప్రకారం బాలిక ప్రాణాలకు ముప్పు లేదని నిర్ధారిస్తే ఆమె ఇష్టపూర్వకంగా గర్భవిచ్ఛిత్తి చేసుకోవచ్చని కోర్టు పునరుద్ఘాటించింది. దేశవ్యాప్తంగా మహిళల హక్కులు శరీర స్వయంప్రతిపత్తి పై సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యలు భవిష్యత్తులో చట్టపరమైన సంస్కరణలకు నాంది పలికేలా ఉన్నాయి. న్యాయవ్యవస్థ తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయంపై మహిళా హక్కుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# మలేషియా -గ్లో-ఇన్-ద-డార్క్- రోడ్ల ప్రయోగం: భారతదేశంలో ట్రై చేయాలంటే?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలోని చాలా నిశీధి రోడ్లు ఉన్నాయి. ఏజెన్సీలోని మారు మూల ప్రాంతాలకు రోడ్ మార్గంలో వెళ్లాలంటే రాత్రి పూట విద్యుత్ దీపాలు కూడా అందుబాటులో ఉండవు. ఇంకా చెప్పాలంటే సరిగా రోడ్లు వేయని దుస్థితి ఇంకా ఉంది. అయితే మారుమూల ప్రాంతాలకు కూడా భయం బెరుకు లేకుండా వెళ్లాలంటే మలేషియా దేశంలో చేసిన ఈ ప్రయోగం నిజంగా ఆశ్చర్యపరుస్తుంది. అయితే ఇది ప్రభుత్వాలకు ఆర్థిక భారంగా మారడం దురదృష్టకరం. ఆలోచన మంచిదే అయినా అది ఆచరణలో సాధ్యపడకపోవడం నీరసపడేట్టు చేస్తోంది. రాత్రిపూట వీధి దీపాలు లేని రహదారులపై ప్రయాణించే వాహనదారులకు అండగా నిలుస్తుందని భావించిన -గ్లో-ఇన్-ద-డార్క్- (చీకటిలో మెరిసే) రోడ్ మార్కింగ్స్ ప్రయోగానికి మలేషియా ప్రభుత్వం స్వస్తి చెప్పే ఆలోచనలో ఉంది. మలేషియాలోని సెలాంగర్ రాష్ట్రంలో అత్యంత ఆసక్తికరంగా ప్రారంభమైన ఈ ప్రయోగంపై అక్కడి పార్లమెంట్ తాజాగా పెదవి విరిచింది. ఈ వినూత్న సాంకేతికతపై తమ మంత్రిత్వ శాఖ నిపుణులు సంతృప్తికరంగా లేరని.. దీనికి అయ్యే ఖర్చు చాలా ఎక్కువగా ఉందని డిప్యూటీ వర్క్స్ మినిస్టర్ అహ్మద్ మస్లాన్ స్పష్టం చేశారు.నిజానికి విద్యుత్ వినియోగాన్ని తగ్గించి.. కార్బన్ ఉద్గారాలను నియంత్రించాలనుకునే నగరాలకు ఈ -స్వయంగా వెలిగే- లైన్ల ఆలోచన అద్భుతంగా అనిపిస్తుంది. కానీ మలేషియా ఉదంతం ఒక విషయాన్ని గుర్తు చేస్తోంది. ఏదైనా సాంకేతికత చూడటానికి ఆకర్షణీయంగా ఉండి ప్రజల ఆదరణ పొందినా నిర్వహణ ఖర్చులు.. ప్రభుత్వ బడ్జెట్ పరిమితుల ముందు అది నిలబడటం కష్టమని తేలిపోయింది. పైలట్ ప్రాజెక్ట్ స్థాయిలో బాగున్నా.. క్షేత్రస్థాయిలో అమలుకు ఆర్థిక సవాళ్లు అడ్డుగా నిలిచాయి.ఈ ప్రయోగాన్ని తొలుత హులు లంగత్ ప్రాంతంలోని ఒక చీకటి రహదారిపై చేపట్టారు. కేవలం వాహనాల హెడ్‌లైట్లపైనే ఆధారపడే డ్రైవర్లకు దిశానిర్దేశం చేసేందుకు సుమారు 245 మీటర్ల మేర ఈ -ఫోటోలూమినిసెంట్- మార్కింగ్‌లను వేశారు. సాధారణంగా వాడే -క్యాట్స్ ఐస్- కు ప్రత్యామ్నాయంగా వీటిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పగటిపూట మామూలు పెయింట్‌లా కనిపించే ఈ లైన్లు, రాత్రి కాగానే స్వయంగా వెలుగుతూ వాహనదారులకు భద్రతా భావాన్ని కల్పించాయి.

ప్రారంభంలో ఈ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వం సానుకూలంగానే స్పందించింది. వర్క్స్ మినిస్టర్ అలెగ్జాండర్ నాంటా లింగి మాట్లాడుతూ.. ఈ మార్కింగ్‌లు చీకటిలో స్పష్టంగా కనిపిస్తున్నాయని... వీధి దీపాలు లేని చోట ప్రయాణికులు మరింత సురక్షితంగా దారి చూపుతున్నాయని భావిస్తున్నారని పేర్కొన్నారు. అయితే అప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు అయ్యే ఖర్చుపై అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ప్రాజెక్ట్ పనితీరును మెచ్చుకున్నా.. దాన్ని కొనసాగించాలంటే అయ్యే ఆర్థిక భారం వారిని వెనక్కి లాగింది.ఈ ప్రాజెక్ట్ ఖర్చుల వివరాలను పరిశీలిస్తే ...అధికారుల భయం వెనుక ఉన్న అసలు కారణం అర్థమవుతుంది. సాధారణ రోడ్డు మార్కింగ్ పెయింట్ ధర ఒక చదరపు మీటరుకు కేవలం 40 రింగ్గిట్లు కాగా... ఈ మెరిసే పెయింట్ ధర ఏకంగా 749 రింగ్గిట్లుగా తేలింది. అంటే సాధారణ పెయింట్ కంటే ఇది సుమారు 19 రెట్లు ఎక్కువ ఖరీదైనది. అంతర్జాతీయ కరెన్సీ లెక్కలో చూస్తే.. సాధారణ పెయింట్ చదరపు అడుగుకు సుమారు 0.81 డాలర్లు ఖర్చయితే... ఈ గ్లో పెయింట్‌కు 15.20 డాలర్లు ఖర్చవుతోంది.నిర్వహణ పరంగా చూస్తే ఈ వ్యయం ఇంకా పెరిగే అవకాశం ఉంది. వర్షాకాలం తర్వాత రోడ్లపై పెయింట్ వెలవెలబోతే... తిరిగి వేయడానికి భారీగా ప్రజా ధనం వెచ్చించాల్సి ఉంటుంది. తొలుత ఈ పథకాన్ని 15 అదనపు ప్రాంతాలకు విస్తరించి.. 15 కిలోమీటర్ల మేర రోడ్లను మెరిపించాలని లక్ష్యంగా పెట్టుకున్నా.. ప్రస్తుత పరిస్థితుల్లో అది అసాధ్యమనిపిస్తోంది. పర్యావరణ హితమైన సాంకేతికతలు కూడా ఆర్థిక స్థిరత్వంతో తోడైతేనే విజయవంతమవుతాయని మలేషియా ప్రయోగం నిరూపించింది.

అయితే మలేషియాలో ప్రయోగం విఫలమైనా.. ఈ విధానాన్ని తక్కువ ఖర్చుతో అమలయ్యేలా చేయడానికి సాంకేతికంగా ఇంకేదైనా భారతదేశంలోని శాస్త్ర వేత్తలు కనిపెడితే బావుంటుందేమో! ప్రతిదానికి ఒక పరిష్కారం తప్పకుండా ఉంటుంది. మలేషియా ఏదైతే ఫ్లాప్ ప్రయోగం చేసిందో దానిని సక్సెస్ చేసేందుకు యువ ఔత్సాహిక శాస్త్ర వేత్తలు తరుణోపాయాన్ని కనుగొంటే బావుంటుంది. 30 వేలకే సోలార్ కార్ కనిపెట్టిన వ్యక్తి రాయలసీమలో ని ఒక గ్రామంలో ఉన్నాడు. అలాంటప్పుడు మారుమూల రోడ్ మార్గాలకు తక్కువ ఖర్చుతో దీపాలను ఏర్పాటు చేసే ప్రయోగం ఎందుకు చేయలేరు? అయితే భారతదేశంలో రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు పర్సంటేజీల వ్యవస్థ సమూలంగా మారేందుకు ఆస్కారం లేనప్పుడు ఇలాంటి ప్రయోగాలు ఎంతవరకూ సాధ్యమవుతాయి? అన్నది ప్రశ్నగా ఉంది.

# ఇక అమెరికా వెళ్లలేం.. హెచ్1బీకి ఎసరు పెడుతున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** దశాబ్దాలుగా భారతీయ మధ్యతరగతి యువతకు 'అమెరికా కల' ఒక జీవన సాఫల్య చిహ్నం. గ్రీన్ కార్డులు, డాలర్ల సంపాదన, మెరుగైన జీవన ప్రమాణాలు.. ఇవే లక్ష్యంగా సాగిన ఈ ప్రయాణంలో హెచ్-1బీ వీసా ఒక ప్రధాన వారధిగా నిలిచింది. అయితే రిపబ్లికన్ నేత ఎలి క్రేన్ ప్రతిపాదించిన 'ఎ-1దీ వీసా దుర్వినియోగ నివారణ చట్టం - 2026' బిల్లు ఇప్పుడు ఆ వారధికి బీటలు వేస్తోంది. ఇది కేవలం ఒక వీసా నియమ నిబంధనల మార్పు మాత్రమే కాదు.. గ్లోబల్ టాలెంట్ మార్కెట్‌లో వస్తున్న ఒక పెను మార్పుకు సంకేతం.




**నిబంధనల కొరడా.. ఎవరి కోసం?**

ఈ బిల్లులో ప్రధానంగా వినిపిస్తున్న అంశం.. కనీస వేతనాన్ని ౨200,000 కు పెంచడం. ఇది వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, దీని వెనుక ఉన్న వ్యూహం స్పష్టం. "సాధారణ నైపుణ్యాలకు అమెరికాలో చోటు లేదు." అని తేల్చిచెప్పండి. ఇప్పటివరకు తక్కువ ఖర్చుతో ఐటీ సేవలను అందించిన 'మాస్ రిక్రూట్మెంట్' మోడల్ ఇకపై మనుగడ సాగించడం కష్టం. బ్రాండన్ గిల్ వంటి నేతలు వాదిస్తున్నట్టుగా అమెరికన్ల ఉద్యోగాలను కాపాడటం ఒక ఎజెండా అయితే అత్యుత్తమ ప్రతిభావంతులను మాత్రమే దేశంలోకి రానివ్వడం రెండో ఎజెండా.

**భారతీయ ఐటీ దిగ్గజాలకు 'అగ్నిపరీక్ష'**

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్, విప్రో వంటి సంస్థలకు ఇది ఒక పెద్ద సవాలు. వీసా ఖర్చులు, పెరిగిన వేతనాల భారం వల్ల 'ఆన్‌సైట్' ప్రాజెక్టులు తగ్గక తప్పదు. అయితే ఇది భారత్‌కు ఒక రకంగా 'డిజిటల్ ఆశీర్వాదం' కూడా కావచ్చు. అమెరికాకు వెళ్లలేకపోయినా భారత్ నుంచే ఆ ప్రాజెక్టులు చేసే 'రిమోట్ వర్క్' సంస్కృతి బలపడుతుంది. అత్యుత్తమ మేధస్సు కలిగిన యువత దేశంలోనే ఉండి స్టార్టప్‌లు ప్రారంభించే అవకాశం పెరుగుతుంది.

**విద్యార్థులకు 'రెడ్ అలర్ట్'.. కానీ!**

ఓపీటీ వంటి వెసులుబాట్లపై వేటు పడటం విద్యార్థులను ఆందోళనకు గురిచేసే అంశమే. కానీ దీని అర్థం తలుపులు మూసుకుపోయాయని కాదు.. ఆ తలుపులు చాలా ఎత్తులో ఉన్నాయని గ్రహించాలి. ఇకపై కేవలం 'డిగ్రీ' కోసం అమెరికా వెళ్లే కాలం చెల్లింది. ఏఐ , క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, సైబర్‌సెక్యూరిటీ వంటి అత్యాధునిక రంగాల్లో అసాధారణ నైపుణ్యం ఉంటేనే అమెరికా వీసా దక్కుతుంది. అమెరికా మార్కెట్ ఇప్పుడు "క్వాంటిటీ" (సంఖ్య) నుంచి "క్వాలిటీ" (నాణ్యత) వైపు మళ్లుతోంది.

**స్థాయి పెంచుకోవాల్సిన సమయం**

అమెరికా విదేశీ వలస విధానం ఇప్పుడు "హార్డ్ మోడ్" లోకి ప్రవేశించింది. దీనిని ఒక విపత్తుగా చూడటం కంటే మన నైపుణ్యాలను అంతర్జాతీయ స్థాయికి పెంచుకోవడానికి ఒక హెచ్చరికగా భావించాలి. అమెరికా కాకపోతే కెనడా, జర్మనీ లేదా ఆస్ట్రేలియా వంటి దేశాలు ఇప్పుడు భారతీయ టాలెంట్ కోసం ఎదురుచూస్తున్నాయి.

అమెరికా కల చెదిరిపోలేదు.. అది తన రూపం మార్చుకుంది. సామాన్యుల నుంచి అసామాన్యులను వేరు చేసే ఈ వడపోతలో నిలబడాలంటే మన యువత "సాధారణం" నుంచి "అసాధారణం" వైపు ప్రయాణించక తప్పదు.

# సీతారాం సూసైడ్ నోట్ లో తన భార్య గురించి నగ్న సత్యాలు.. అసలేం జరిగింది..?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఒక మనిషి ప్రాణం మీద ఆశ వదులుకొని 19 పేజీల సూసైడ్ నోట్ రాశారంటే, ఆ వ్యక్తి ఎంతటి మానసిక వేదనను అనుభవించి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సీతారాం ఆత్మహత్య ఘటన కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన విషయం కాదు, ఇది నమ్మకద్రోహం, సోషల్ మీడియా వికృత పోకడలకు పరాకాష్టగా నిలిచింది.

ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య, ఇద్దరు పిల్లలు, మంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. బయట ప్రపంచానికి సీతారాం జీవితం ఎంతో అందంగా కనిపిస్తుంది. కానీ, ఆ అందమైన సంసారం వెనుక భార్య రేణుక సాగిస్తున్న వివాహేతర సంబంధాలు ఆయనను బాగా కుంగదీశాయి. చివరకు ఫిబ్రవరిలో ట్యాంక్ బండ్ పై నుంచి దూకి ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న 19 పేజీల సూసైడ్ నోట్ ఇప్పుడు ఈ కేసులో అసలు నిజాలను బయటపెట్టింది.

**ఏడాదిన్నరలో ముగ్గురితో సంబంధం**

సీతారాం తన లేఖలో భార్య రేణుక అసలు స్వరూపాన్ని ప్రపంచానికి తెలియజేశారు. రేణుక కేవలం ఏడాదిన్నర కాలంలోనే ముగ్గురితో వివాహేతర సంబంధాలు పెట్టుకుందని ఆయన ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లోటు రాకుండా చూసుకున్నప్పటికీ, తను ఇంట్లో లేని సమయంలో 'రమణ' అనే వ్యక్తిని ఇంటికి పిలిపించుకొని గడిపేదని వాపోయారు. రేణుక తన ప్రియుడితో ఉన్న సమయంలో ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేయడం, ఆ తర్వాత వాటిని సదరు వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేయడం సీతారాంను మానసిక వేదనకు గురి చేశాయి. ఆ వీడియోలు చూశాకే భార్య నిజస్వరూపం తనకు తెలిసిందని పేర్కొన్నారు.

**సీతారాం ఆఖరి ప్రశ్న**


'ఒక అమ్మాయి ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేయడం ఏంటి? సదరు వ్యక్తి ఆ వీడియోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం ఏంటి? అవి చూసి నేను ఎలా తట్టుకోవాలి?' అని ఆయన ప్రశ్నించడం గుండెలను పిండేస్తోంది. ప్రేమ లేదా శృంగారం.. అసలు రేణుకకు ఏం కావాలో అర్థం కావడం లేదని, తన చావుకు భార్య ప్రవర్తనే కారణమని ఆయన స్పష్టం చేశారు.

**పోలీసుల దర్యాప్తు**

సీతారాం తల్లిదండ్రుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన బాచుపల్లి పోలీసులు ఈ కేసులో కీలక పురోగతి సాధించారు. సూసైడ్ నోట్ ఆధారంగా రేణుకతో పాటు ఆమె ప్రియులు రమణారెడ్డి, శ్రవణ్ ను అరెస్ట్ చేశారు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహం జరిగింది. ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ రేణుక ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ ఘటన సోషల్ మీడియా, వివాహేతర సంబంధాలు సృష్టించే భయంకరమైన నష్టాలకు నిదర్శనం. ప్రైవేట్ వీడియోలు రికార్డ్ చేయడం, వాటిని సోసల్ మీడియా ప్లాట్ ఫాంలు ఇన్‌స్టా ఫేస్ బుక్ లాంటి వాటిలో పెట్టి వేధించడం నేరపూరిత సంస్కృతిని సూచిస్తున్నాయి. సీతారాం వంటి విద్యావంతులు ఆత్మహత్యే పరిష్కారం అనుకోవడం చాలా బాధాకరమైన విషయం. ఈ కేసులో నిందితులకు కఠిన శిక్ష పడితేనే, మరే ఆడపిల్ల లేదంటే మగవాడు ఇలాంటి దారుణాలకు ఒడిగట్టడు. కుటుంబ వ్యవస్థలో నమ్మకం అనే పునాది లేకపోతే శ్మశానంగా మారుతుందనేందుకు ఈ ఘటనే సాక్ష్యం.

# కలల అమెరికాలో కడతేరిన జీవితం.. ఉద్యోగ వేటలో ఒత్తిడి తట్టుకోలేక తెలుగు విద్యార్థి చందు ఆత్మహత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** ఖండంతరాలు దాటి కన్న కలలు కల్లలవుతున్నాయి. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థుల జీవితాలు మునుపెన్నడూ లేనంత సంక్షోభంలో పడ్డాయి. తాజాగా 26 ఏళ్ల తెలుగు విద్యార్థి చందు ఆత్మహత్య ఘటన అమెరికాలో ఉంటున్న భారతీయ విద్యార్థుల దయనీయ స్థితికి నిదర్శనంగా నిలిచింది. ఈ విషాదకర వార్త తెలుగు రాష్ట్రాల్లో పెను కలకలం సృష్టిస్తోంది.



**కలల అమెరికాలో కడతేరిన జీవితం.. చందు విషాద గాథ**

ఉన్నత విద్యను అభ్యసించి, కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఆశతో చందు కొన్నేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. చికాగోలోని డీపాల్ యూనివర్సిటీ లో మాస్టర్స్ పూర్తి చేసిన అతను.. గతేడాది కాలంగా ఉద్యోగ వేటలో ఉన్నాడు. చదువు పూర్తయిన తర్వాత లభించే ఓపీటీ (ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ) గడువు ముగిసే సమయం దగ్గర పడుతుండటంతో అతనిపై ఒత్తిడి పెరిగింది.

మరోవైపు లక్షలాది రూపాయల విద్యా రుణాలు, రోజువారీ ఖర్చులు భారం కావడంతో చందు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యాడు. వేల సంఖ్యలో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. ప్రస్తుత ఆర్థిక మాంద్యం పరిస్థితులు.. కఠినమైన వీసా నిబంధనల వల్ల ఆశించిన ఫలితం దక్కలేదు. భవిష్యత్తుపై నమ్మకం కోల్పోయిన చందు.. చివరకు ఆత్మహత్యకు పాల్పడి తన జీవితాన్ని అర్ధాంతరంగా ముగించాడు.

**అమెరికాలో మారుతున్న సమీకరణాలు.. భారతీయ విద్యార్థుల ఆందోళన**

అమెరికాలో ఇటీవల ఏర్పడిన రాజకీయ మార్పులు, ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ పాలనలో అమల్లోకి వస్తున్న కఠినమైన ఇమ్మిగ్రేషన్ విధానాలు భారతీయ విద్యార్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గతంలో అమెరికా అంటే అవకాశాల గని అని భావించిన వారంతా ఇప్పుడు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్నారు. టెక్ రంగంలో భారీగా జరుగుతున్న లే-ఆఫ్స్ కొత్తగా చదువు పూర్తి చేసిన విద్యార్థుల అవకాశాలను దెబ్బతీస్తున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం, అమెరికాలో పెరిగిన జీవన ప్రమాణాలు విద్యార్థులకు భారంగా మారాయి. హెచ్1బీ వీసా నిబంధనల్లో మార్పులు.. ఓపీటీ గడువు వంటి అంశాలు విద్యార్థులను నిరంతరం భయం గుప్పెట్లోనే ఉంచుతున్నాయి.

**మానసిక ఆరోగ్యమే ప్రధాన సమస్య**

చందు మరణం కేవలం ఒక వ్యక్తి మరణం కాదు.. అది విదేశాల్లో వేలాది మంది విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణకు ప్రతిరూపం. కుటుంబ సభ్యుల అంచనాలు.. తీసుకున్న అప్పులు తీర్చాలనే తపన, తోటివారితో పోలికలు విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. చందు వంటి మృదుస్వభావి, కష్టపడి పనిచేసే వ్యక్తి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అతని స్నేహితులను దిగ్భ్రాంతికి గురిచేసింది.

ప్రస్తుతం చందు భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తరలించేందుకు చికాగోలోని భారతీయ సంఘాలు తానా, నాటా వంటి సంస్థలు కృషి చేస్తున్నాయి. అతని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

**పరిష్కారం ఎక్కడ?**

ఈ హృదయ విదారక ఘటన విదేశీ విద్యపై వెళ్లే విద్యార్థులకు.. వారి తల్లిదండ్రులకు ఒక హెచ్చరిక. విద్యార్థులకు కేవలం చదువే కాదు, వైఫల్యాలను తట్టుకునే మానసిక ధైర్యం కూడా అవసరం. ప్రభుత్వం, విద్యాసంస్థలు విదేశాల్లో ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# బుద్ధ పౌర్ణమి 2026: ఈ 5 వస్తువులు ఇంట్లోకి తెచ్చుకుంటే డబ్బు, సంతోషం, అదృష్టం మీ సొంతం!




హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ మాసంలో వచ్చే పౌర్ణమికి చాలా ప్రత్యేకత ఉంది. ఈ ఏడాది మే 1వ తేదీన వైశాఖ పౌర్ణమి వస్తోంది. ఇదే రోజును మనం 'బుద్ధ పౌర్ణమి'గా జరుపుకుంటాం. ఎందుకంటే, గౌతమ బుద్ధుడు జన్మించినది, ఆయనకు జ్ఞానోదయం కలిగినది ఇంకా ఆయన పరమపదించినది కూడా ఇదే రోజున అని నమ్ముతారు. ఈ పవిత్రమైన రోజున కొన్ని వస్తువులను ఇంటికి తెచ్చుకోవడం వల్ల సుఖసంతోషాలు, సంపద కలుగుతాయని పెద్దలు చెబుతుంటారు.... అయితే అవేంటో చూద్దాం:

**1. బుద్ధుని విగ్రహం**

శాంతికి మారుపేరు బుద్ధుడు. ఇంట్లో బుద్ధుని విగ్రహం ఉంటే మనశ్శాంతి లభిస్తుందని వాస్తు నిపుణులు చెబుతారు. బుద్ధ పౌర్ణమి రోజున ధ్యాన ముద్రలో ఉన్న బుద్ధుని విగ్రహాన్ని లేదా లాఫింగ్ బుద్ధాను తెచ్చుకుని ఇంట్లో కొంచెం ఎత్తైన ప్రదేశంలో ఉంచండి. దీనివల్ల ఇంట్లోని ఒత్తిడి తగ్గి, ప్రశాంతత నెలకొంటుంది.

**2. ఇత్తడి ఏనుగు**

వాస్తు శాస్త్రం ప్రకారం ఏనుగు స్థిరత్వానికి, ఐశ్వర్యానికి సంకేతం. బుద్ధ పౌర్ణమి రోజున ఇత్తడితో చేసిన ఏనుగు బొమ్మను కొని, ఇంటి ముఖ ద్వారం లోపలి వైపు చూస్తున్నట్లుగా పెడితే ఇంట్లోకి సానుకూల శక్తి వస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య గొడవలు తగ్గి సఖ్యత పెరుగుతుంది.

**3. గవ్వలు**

గవ్వలు అంటే లక్ష్మీదేవికి చాలా ఇష్టం. పాల సముద్రాన్ని చిలికినప్పుడు పుట్టిన వస్తువుల్లో గవ్వలు కూడా ఉన్నాయి. అందుకే సంపద పెరగాలంటే గవ్వలు ఇంట్లో ఉండాలని అంటారు. ఈ రోజు కొన్ని గవ్వలను తెచ్చుకుని, వాటికి పూజ చేసి, ఎర్రటి బట్టలో కట్టి మీ బీరువాలో లేదా డబ్బులు పెట్టే చోట ఉంచితే ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి.

**4. వెండి నాణెం**

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం వెండికి, చంద్రుడికి దగ్గరి సంబంధం ఉంది. చంద్రుడు మనస్సుకు కారకుడు. పౌర్ణమి రోజున వెండి నాణెం కొని మీ పూజ గదిలో ఉంచడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. అలాగే దీనివల్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, అదృష్టం కలిసి వస్తుందని నమ్ముతారు.

**5. శ్రీ యంత్రం**

శ్రీ యంత్రం సాక్షాత్తూ లక్ష్మీదేవి స్వరూపం. బుద్ధ పౌర్ణమి నాడు శ్రీ యంత్రాన్ని ఇంటికి తెచ్చుకుని నిష్టతో పూజిస్తే సంపదకు కొదవ ఉండదు. వ్యాపారంలో అభివృద్ధి చెందాలన్నా, ఇంట్లో దరిద్రం పోవాలన్నా ఈ యంత్రాన్ని పూజా గదిలో ఉంచి రోజూ ప్రార్థించడం మంచిది.

# జ్యోతిష్యం : మే నెల పౌర్ణమితో మొదలు.. పౌర్ణమితో ముగింపు.. మే నెలలో వచ్చే పండుగలు ఇవే




మే నెల.. ఇంగ్లీషు సంవత్సరాల్లో ఇది ఐదవ నెల .. సూర్య భగవానుడు భగ భగ మండిపోతాడు. గాలి దుమ్ములు వచ్చే కాలం మే నెల. ఈ ఏడాది మేనెల ఆధ్యాత్మికంగా చాలా విశిష్టత ఉందని పండితులు చెబుతున్నారు. మే నెల పౌర్ణమి తిథితో ప్రారంభం కాగా మరల అదే తిథితో ముగుస్తుంది. ఇంకా ఈ ఏడాది మే నెల విశిష్టత గురించి తెలుసుకుందాం.

పురాణాల ప్రకారం వైశాఖ పౌర్ణమి చాలా విశిష్టమైనది. తెలుగు పంచాంగం ప్రకారం వైశాఖ మాసం పౌర్ణమితో ప్రారంభమైన మే మంత్ జ్యేష్ట మాసం పౌర్ణమి తిథితో ముగుస్తుంది. అంటే 2026 మే నెల స్టాటింగ్? డే.. మరియు ఎండింగ్ డే..ఈ రెండు రోజుల్లో చంద్రుడు వెన్నెల కురిపించనున్నాడుజ్యోతిష్యశాస్త్రం ప్రకారం 2026 మే నెలలోనే సూర్యుడు మేషరాశి నుంచి వృషభరాశిలోకిప్రవేశిస్తాడు. దీనినూ వృషభ సంక్రమణం అంటారు. పురాణాల ప్రకారం వైశాఖ పౌర్ణమి రోజు దాన ధర్మాలు.. , జ్యేష్టమాసంలో జలదానాలు అత్యంత పుణ్యఫలాన్ని ఇస్తాయి. ఇంకా ఇదే నెలలో బుద్ధ జయంతి, హనుమాన్? జయంతి, శని భగవానుడి పుట్టిన రోజు వంటి పర్వదినాలు కూడా ఉన్నాయి. ఈ నెలలో అనేక శుభ ముహూర్తాలు ఉన్నాయి.

**2026 మే నెల పండుగల వివరాలు**

**మే 1 (వైశాఖ పూర్ణిమ):** దీనినే బుద్ధ పూర్ణిమ అని కూడా పిలుస్తారు. వైశాఖ పూర్ణిమ రోజున శ్రీమహావిష్ణువు కూర్మావతారంలో అవతరించినట్టుగా చెబుతారు. అందుకే వైశాఖ పూర్ణిమ రోజును కూర్మజయంతిగా కూడా జరుపుకుంటారు. అంతేకాదు, మే 1 పూర్ణమి తిథి కావడంతో ఆరోజున సత్యనారాయణ స్వామి వ్రతాలను చేసుకుంటారు.

**మే 12 (హనుమత్ జయంతి):** హనుమంతుడికి కేటాయించిన రోజు. మే 12 వ తేదీ హనుమాన్ జయంతి కూడా రావడంతో తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహిస్తారు. వైశాఖ బహుళ దశమి రోజున హనుమాన్ జయంతిని జరుపుకోబోతున్నాం. అంతేకాదు, హనుమంతుడికి అత్యంత ఇష్టమైన మంగళవారం కూడా అదే రోజు కావడం ఈ పండుగకు మరింత ప్రాశస్త్యం ఏర్పడింది. మే 16 ( శనిజయంతి): శని భగవానుడు జన్మించిన రోజు కావడంతో ఏలినాటి శని ప్రభావం ఉన్నవారు ఆరోజున స్వామివారికి తైలాభిషేకం చేస్తారు. ఇలా శని జయంతి రోజున తైలాభిషేకం చేయడం వలన ప్రభావం 50 శాతం వరకు తగ్గుతుందని పండితులు చెబుతున్నారు.

మే 16( వట సావిత్రి వ్రతం): మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. వట వృక్షాన్ని పూజించి ఈ వ్రతం చేయడం వలన సౌభాగ్యం సిద్ధిస్తుందని నమ్మకం.

మే 25( గంగా దసరా పండుగ) : పవిత్రమైన గంగానది భూమికి దిగివచ్చిన రోజు గంగా దసరా. ఆధ్యాత్మిక శుద్ధి, దానధర్మాలు, ఆశీర్వాదాలను కొనుకోవడానికి ఈరోజు అత్యంత పవిత్రమైనదిగా చెబుతారు.


**మే 26 : యమునా నది పుష్కరాలు ప్రారంభం**

**మే 28( నిర్జల ఏకాదశి) :** ఏడాదిలో వచ్చే 24 ఏకాదశుల్లో ఈ నిర్జల ఏకాదశి అత్యంత కఠినమైనదిగా చెబుతారు. ఈ నిర్జల ఏకాదశి రోజున చుక్కనీరు కూడా ముట్టుకోకుండా ఉపవాసం చేయాలి. ఇలా చేయడం వలన సకల పాపాలు తొలగిపోతాయిని చెబుతారు.

**మే 31(ఏరువాక పౌర్ణమి):** ఈరోజున రైతులు నాగలిపట్టి పొలాన్ని దున్నే శుభ సమయం. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగల్లో ఏరువాక పౌర్ణమి ఒకటి. పొలం దున్నిన రోజు నుంచి రైతుల పొలం పనులు ప్రారంభమౌతాయి. అంటే వైశాఖ పౌర్ణమి తిథితో ప్రారంభమైన 2026 మే నెల జ్యేష్ట పౌర్ణమితో ముగుస్తుంది.

మొత్తంగా చెప్పాలంటే మే నెలలో ప్రతి ఒక్కరూ కనీసం ఐదు రోజులు ఉపవాసం, జపం, దానం చేయడం ద్వారా జీవితంలో శాంతిని, సుఖాన్ని పొందవచ్చు. ఈ మే నెలలో భక్తితో చేసిన ప్రతి పని మహాపుణ్య ఫలాన్ని ఇస్తుంది. ఆధ్యాత్మికతను ఆచరిస్తే జీవితం సార్థకమౌతుందని పండితులు చెబుతున్నారు.

# బుద్ధ పూర్ణిమ 2026 : ప్రపంచానికి జ్ఞనాన్ని అందించిన గౌతముడు పుట్టిన రోజు ఇదే..!




బుద్ధ పూర్ణిమ.. వైశాఖ పౌర్ణమి.. ఈ పర్వదినానికి మనదేశంలో ఎంతో విశిష్టత ఉంది. హిందూ క్యాలెండర్ ప్రకారం ఈ ఏడాది మే1 న అంటే శుక్రవారం రోజున బుద్ధ జరుపుకోనున్నాం. ఈ రోజు బౌద్ధులకు కూడా ఎంతో ప్రత్యేకమైన రోజు. మరి ఈ రోజు బౌద్ధులకు ఎందుకు అంత ప్రత్యేకమైన రోజో ఇప్పుడు తెలుసుకుందాం.

బౌద్ధ మతం స్థాపకుడైన బుద్ధుడు అసలు పేరు సిద్ధార్థ గౌతముడు. అతను వైశాఖ మాసంలో పూర్ణిమ తిథి (పౌర్ణమి రాత్రి) లో లుంబినిలో కులీన శాక్య వంశానికి చెందిన సుద్దోదన మహరాజు, రాణి మాయదేవికి జన్మించాడు. యాదృచ్ఛికంగా చాలా రోజుల తరువాత సిద్ధార్థుడికి జ్ఞానోదయం పొందాడు. బోధగయలో రావిచెట్టు కింద ధ్యానం చేస్తూ జ్ఞానోదంయ పొందాడు.

గౌతమ బుద్ధుడు బోధ గయలో జ్ఞానోదయం అనంతరం తన మొదటి బోధన సారనాథ్ లో ఇచ్చాడనే సంగతి అందరికి తెలిసిందే. బోధగయ నుంచి 5 వారాల పాటు సారనాథ్ కు ప్రయాణం సాగించి అక్కడ తన మొదటి ప్రసంగాన్ని ఇచ్చాడు. మొదటి బోధనను గురుపూర్ణిమ రోజే బుద్ధుడు తన శిష్యులకు బోధించాడు.

బుద్ధుని జీవితంలో వైశాఖ పూర్ణిమ మూడుసార్లు అత్యంత ప్రాముఖ్యతను వహించింది. కపిలవస్తు రాజు శుద్ధోధనుడు, మహామాయలకు ఓ వైశాఖ పౌర్ణమి నాడు సిద్ధార్థుడిగా జన్మించాడు. మరో వైశాఖ పూర్ణిమనాడు జ్ఞానోదయం పొంది సిద్ధార్థుడు బుద్ధుడిగా మారాడు. వేరొక వైశాఖ పూర్ణిమనాడు నిర్యాణం చెందాడు. తల్లి చనిపోవడంతో గౌతమి అనే మహిళ సిద్ధార్థుని పెంచిందని... అందుకే గౌతముడనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతారు. భాగవత పురాణంలో వివరించబడిన వివరాల ప్రకారం ఉత్తర హిమాలయ పుణ్య శ్రేణులలో ఉన్న శంబళ కేంద్రం నుంచి ప్రేరణ వస్తుంది. దశవతారమైన కల్కి శంబళ గ్రామం నుంచి అవతరించాడు.

మధ్య హిమాలయ శ్రేణులలో ఉన్న కలాప గుహలలో ఉన్న పరమగురు పరంపర ముఖ్య కేంద్రంలో ఈ ప్రేరణను అందుకుంటారని పురాణాల ద్వారా తెలుస్తుంది.

వైశాఖ పూర్ణిమ... దీనిని మహా వైశాఖి.. బుద్ధ పూర్ణమి అనే పేరుతో పిలుస్తారు. గౌతమ బుద్ధుడు భూమండల ప్రభువైన సనత్కుమారులు, పరమ గురువుల పరంపర మధ్య వారధిగా ఉంటాడని, అందువల్లే వైశాఖ పూర్ణిమ.. బుద్ధ పూర్ణిమగా ప్రసిద్ధి చెందింది.

బుద్ధుని ఉపదేశంలో గొప్ప సత్యాలున్నాయి. అవి.. లోకం దుఃఖమయం, దుఃఖానికి మూలం కోరిక, కోరికను నివారించడం ద్వారా దుఃఖాన్ని నివారించవచ్చు, అష్టాంగ మార్గాన్ని అనుసరించడం ద్వారా కోరికలను నివారించవచ్చన్నాడు. అష్టాంగ మార్గంలో సరైన దృష్టి, సరైన ఆలోచన, సరైన వాక్కు, సరైన క్రియ, సరైన జీవనం, సరైన సాధన, సరైన స్మృతి, సరైన ధ్యానం వంటి ఎనిమిది శాస్త్రీయ పరిష్కారాలు చూపాడు. వీటిని చక్కగా ఆచరించడం ద్వారా ప్రశాంతత, శాంతి లభిస్తుంది. ఇవీ నేటి సమాజంలో కూడా ఆచరణీయమైనవి. మానవ విలువలు కలిగిన బౌద్ధం.. అశోకుడు వంటి గొప్ప రాజుల ఆదరణకు నోచుకొన్నది. దీంతో సామాన్య జనులకు దగ్గరైంది. బుద్ధుడు సరళమైన తాత్వికత, ఆచరణాత్మక విధానాలు భారతదేశంతోపాటు ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి.

## జ్యోతిష్యం: మీనరాశిలోకి శని, కుజుడు.. చంద్ర సంచారంలో మార్పు.. నాలుగు రాశుల వారికి తిరుగులేని అదృష్టం..



వైశాఖ పౌర్ణమి.. బుద్ద పౌర్ణమి 2026 మే 1 శుక్రవారం. ఈ రోజు ఆధ్యాత్మికంగా చాలా ప్రత్యేకమైన రోజు. జ్యోతిష్యశాస్త్రం ప్రకారం ఈ ఏడాది (2026) అలాంటి పవిత్రమైన రోజున మీనరాశిలో శని.. కుజుడు కలయిక వలన బుధాదిత్య యోగం, సిద్ధి యోగాలు ఏర్పడనున్నాయి. ఇంకా అదే రోజు ( 2026 మే 1 శుక్రవారం ) ఉదయం 2.16 గంటలకు రాహువుచంద్రుడు ... రాహువు అధిపతి అయిన స్వాతి నక్షత్రంలోకి ప్రవేశించనున్నాడు. ఈ గ్రహాల సంచారంలో మార్పు వలన నాలుగు రాశుల వారికి అనేక విధాలుగా లాభాలు కలుగనున్నాయి. ఇప్పుడు ఆ అదృష్టరాశుల గురించి తెలుసుకుందాం. .

మిధున రాశి: ఈ రాశి వారికి వైశాఖ పౌర్ణమి వేళ చంద్ర సంచారంలో మార్పు వలన అన్ని విధాలుగా శుభ ఫలితాలుంటాయి. ఉద్యోగస్తులు.. వ్యాపారస్తులు.. చేతి వృత్తుల వారి సక్సెస్‌ను ఎవరూ ఆపలేరు. బిజినెస్‌కు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటే కూడా బాగా కలిసి వస్తుంది. ఆనందం కూడా రెట్టింపు అవుతుంది.ఆర్థిక లాభాలు కలగనున్నాయి. శుభవార్తలు వింటారు. మనసు ప్రశాంతంగా మారుతుంది. . కుటుంబంతో ఎక్కువ సమయం సంతోషంగా గడుపుతారు. ఈ సమయంలో వ్యాపారాలకు సంబంధించి ఏ నిర్ణయాలు తీసుకున్నా.. మంచి విజయాలు అందుకుంటారు.

కర్కాటకరాశి: చంద్రుడు నక్షత్ర మార్పు ఈ రాశి వారికి సానుకూల ఫలితాలను కలుగుతాయి. ఆగిపోయిన పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు ప్రమోషన్? వచ్చే అవకాశం ఉంది. కోర్టు సంబంధిత విషయాల్లో మంచి పరిష్కారం లభిస్తుంది. కుటుంబ సభ్యుల మధ్య అభిప్రాయ బేధాలు తొలగుతాయి. కొత్త ప్రాజెక్ట్?లు చేపట్టే అవకాశం. వ్యాపారస్తులు గతంలో పెట్టిన పెట్టుబడుల నుంచి లాభాలు పొందుతారు. అన్ని విషయాల్లో అనుకూల ఫలితాలను పొందుతారు. ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలు అందే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు.

సింహరాశి: చంద్రగ్రహం సంచారంలో మార్పు .. మీనరాశిలో కుజుడు.. శని కలయిక వలన ఈ రాశి వారికి ఆత్మవిశ్వాశం పెరిగే అవకాశం ఉంది. తీసుకున్న ప్రతి నిర్ణయంలో కూడా సానుకూల పలితాలుంటాయి. సమాజంలో ఉన్నత వ్యక్తులు పరిచయవుతారు. గౌరవ.. మర్యాదలు పెరుగుతాయి. నిరుద్యోగులకు ఆశించిన జాబ్? వస్తుంది. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతారు. కొత్త ఆదాయ మార్గాలు ఏర్పడే అవకాశం ఉందని జ్యోతిష్య పండితులు చెబుతున్నారు.

కుంభరాశి: వైశాఖ పౌర్ణమి రోజున చంద్రుడు నక్షత్రం మార్పు వలన ఈ రాశి వారికి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటుంది. వ్యాపారస్తులు ఊహించని లాభాలు కలుగుతాయి. విదేశీ ప్రయాణాలు కలిసి వస్తాయి, మానసిక ప్రశాంతత కలుగుతుంది.పాత బకాయిలు వసూలు వసూలవుతాయి. పూర్వీకుల ఆస్తి కలిసి వచ్చే అవకాశం ఉంది. ఈ రాశి వారు ఆర్థిక లాభాలు పొందే అవకాశం ఉందని పండితులు చెబుతున్నారు.

## బీపీ ఉన్నవారు రక్తదానం చేయొచ్చా.. బ్లడ్ ఇస్తే లాభమా..నష్టమా.. ఏమవుతుంది.



రక్తదానం ప్రతి ఒక్కరు చేయగల పనిగానే కనిపించినా దీన్ని చేసేటప్పుడు కొన్ని ఆరోగ్య ప్రమాణాలను పాటించడం తప్పనిసరి . బీపీ అధికంగా ఉన్నవారు కూడా రక్తదానం ఇవ్వకూడదు. పల్స్ రేటు సాధారణంగా ఉన్నవారు మాత్రమే రక్తదానం చేయాలి. అలాగే గుండె జబ్బులు ఉన్నవారు, క్యాన్సర్ వంటి అనారోగ్యాలు ఉన్నవారు రక్తదానానికి దూరంగా ఉండాలి. అలాగే బీపీ.. షుగర్? ఉన్న వారు కూడా రక్తదానం చేయకపోవడమే మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. అధికంగా బీపీ ( బ్లడ్? ప్రెజర్?) ఉన్నవారు రక్తదానం చేస్తే ఎమవుతుందో ఈ స్టోరీలో తెలుసుకుందాం...

రక్తదానం ఎంతో గొప్పది. ఇది మనిషి ప్రాణాన్ని కాపాడుతుంది. అందుకే రక్తదానం మహా దానం అనే పదం వచ్చింది. . రక్తం ఇవ్వాలంటే దాత పూర్తిగా ఆరోగ్యంగా ఉండాలి. దాత బరువు కనీసం 50 కిలోలు ఉండాలి. డయాస్టోలిక్ బీపీ 50 నుంచి 100 మధ్యగా, సిస్టోలిక్ బీపీ 100 నుంచి 180 మధ్యగా ఉండాలి. పల్స్ రేట్ 50 నుంచి 100 మధ్య ఉండాలి. సాధారణంగా బీపీ ఉన్నవారికి బ్లడ్? ప్రెజర్? తరచుగా మారుతుంది. రక్తదానం చేసే సమయంలో బ్లడ్? ప్రెజర్? లో మార్పులు వస్తే దాని ప్రభావం గుండె .. మెదడు పై పడే అవకాశం. ఒక్కోసారి హార్ట్? బరస్ట్? అవుతుంది. ప్రెజర్? ఎక్కువైతే మెదడులో నరాలు తెగిపోయే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అంతే కాదు బీపీ సాధారణ స్థాయి కన్నా తగ్గితే అపస్మరక స్థితిలో ( కోమా)కి వెళ్లే అవకాశం ఉంది. అందుకే నడి వయస్సులో ఉన్న కాని బీపీ వ్యాధితో బాధపడే వారిని.. బీపీ ఉన్న వారిని రక్తదానం చేయవద్దని వైద్యులు చెబుతుంటారు.

రక్తదానం ఇచ్చేందుకు వెళ్లిన వెంటనే ముందు బీపీ టెస్ట్? చేస్తారు. అందులో హెచ్చు తగ్గులు ఉన్నా.. గతంలో బీపీ ఉందని అనుమానం వచ్చిన సరే అలాంటి వారి నుంచి రక్తం తీసుకోరు. సున్నితంగా తిరస్కరించి వెనక్కు పంపుతారు.

రక్తం దానం చేసే వారు ఆరోగ్యంగా ఉండాలి. ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చు. ఎందుకంటే శరీరం స్వయంగా కొత్త రక్తకణాలను ఉత్పత్తి చేస్తుంది. కానీ కొన్ని ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్నవారు రక్తం ఇవ్వకూడదు. హెచ్ఐవీ, హెపటైటిస్, క్యాన్సర్, క్షయ, గుండె జబ్బులు, బీపీ, డయాబెటిస్, కిడ్నీ వ్యాధులు ఉన్నవారు రక్తదానం చేయరాదు. మరో ముఖ్య విషయం ఏంటంటే మద్యం సేవించిన 24 గంటల తరువాత మాత్రమే రక్తదానం చేయాలి. ఇలాంటి ప్రమాణాలను పాటించి రక్తదానం చేయాలి.

## పన్ను అధికారుల సోదాల్లో ఇంట్లో ఉన్న గోల్డ్ సీజ్.. బిల్స్ చూపకపోతే టాక్స్ కట్టాలా..? కోర్టు ఏమందంటే..




భారతీయులకు బంగారానికి మధ్య సంబంధం విడతీయలేనిది. పెళ్లిళ్లు, శుభకార్యాలు, వారసత్వంగా వచ్చే నగలు ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. అయితే ఐటీ అధికారులు సోదాలు జరిగినప్పుడు ఈ బంగారం సీజ్ చేస్తే పరిస్థితి ఏంటి? ఆ గోల్డ్ వెనక్కి ఇవ్వరా ఈ వ్యవహారంలో కోర్టులు, చట్టాలు ఏమంటున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

తాజాగా 'రామనాథ్ గుప్తా బైసాని వర్సెస్ జీజ×' కేసులో ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు బంగారాన్ని దాచుకునే ప్రతి ఒక్కరికీ పెద్ద ఊరటనిస్తోంది. బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తి నివాసంలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించి 2 కేజీల 532 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.కోటి. వీటికి సంబంధించిన కొనుగోలు బిల్లులు చూపలేదన్న కారణంతో.. ఆ మొత్తాన్ని తెలియచేయని ఆదాయం కింద పరిగణించి అధికారులు దానిపై టాక్స్ కట్టాలంటూ ఆదాయానికి కలిపేశారు. అవన్నీ తన కుటుంబ సభ్యుల నగలు, పెళ్లి కానుకలు, వారసత్వంగా వచ్చినవని అతడు వాదించారు.

**టాక్స్ రూల్స్ ఏం చెబుతున్నాయి?**

ఈ కేసులో ట్రిబ్యునల్ 1994 నాటి జదీఱ ఇన్‌స్ట్రక్షన్ నంబర్ 1916ను పరిగణనలోకి తీసుకుంది. ఈ రూల్ ప్రకారం.. ఐటీ సోదాల సమయంలో ఒక పరిమితి వరకు ఉన్న బంగారాన్ని అధికారులు సీజ్ చేయకూడదు. ఆ పరిమితులు ఏంటంటే..

వివాహిత మహిళ: 500 గ్రాములు.
అవివాహిత మహిళ: 250 గ్రాములు.
పురుషుడు: 100 గ్రాములు.

**ట్రిబ్యునల్ సంచలన తీర్పు..**

కేవలం బిల్లులు లేవన్న కారణంతో ఇంట్లో ఉన్న బంగారాన్ని ట్యాక్సబుల్ ఇన్‌కమ్‌గా మార్చలేం అని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. భారతీయ సంస్కృతిలో పెళ్లిళ్లు, వారసత్వం ద్వారా బంగారం చేతులు మారుతుందని.. వీటన్నింటికీ దశాబ్దాల నాటి బిల్లులు ఉండటం అసాధ్యమని పేర్కొంది. పైన పేర్కొన్న పరిమితుల లోపు ఉన్న బంగారానికి పన్ను మినహాయింపు ఇవ్వాలని, దాన్ని ఆదాయంగా పరిగణించకూడదని తన తీర్పులో పేర్కొంది.

ఈ తీర్పుతో బిల్లులు లేని ప్రతి బంగారానికి క్లీన్ చిట్ దొరికినట్లు కాదు. ఆ బంగారం ఎలా వచ్చిందో అధికారులకు సరైన వివరణ ఇవ్వాలి. నిర్ణీత పరిమితి కంటే ఎక్కువ బంగారం ఉంటే మాత్రం తప్పనిసరిగా ఆధారాలు చూపాల్సి ఉంటుంది. ఇది ఐటీ ట్రిబ్యునల్ తీర్పు మాత్రమే. దీనిని హైకోర్టు లేదా సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశం ఐటీ శాఖకు ఉంటుంది. మట్నత్తానికి ఈ తీర్పు సామాన్య ఇన్వెస్టర్లకు పెద్ద ఊరట. కొనుగోలు బిల్లులు లేకపోయినా, కుటుంబ నేపథ్యం, సామాజిక ఆచారాల ప్రకారం ఉన్న బంగారాన్ని చట్టం గౌరవిస్తుందని ట్రిబ్యునల్ నిరూపించింది. కాబట్టి మీ ఇంట్లో పరిమితి లోపు ఉన్న బంగారం విషయంలో ఆందోళన చెందాల్సిన పని అస్సలు లేదని గుర్తుంచుకోండి.

## 4 వేల మందిని పీకేయనున్న కాగ్నిజెంట్.. లేఆఫ్స్ కోసం ఎన్ని కోట్లు పక్కన పెట్టిందంటే..?




ఐటీ రంగంలో మరోసారి లేఆఫ్స్ ప్రకంపనలు స్టార్ట్ అయ్యాయి. ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ రీస్ట్రక్చరింగ్‌లో భాగంగా దాదాపు 4వేల మంది ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైందని సమాచారం. 'ప్రాజెక్ట్ లీప్' పేరుతో చేపట్టిన ఈ భారీ ప్రక్షాళన వెనుక ప్రధాన లక్ష్యం.. ూ× వైపు మళ్లడం, ఖర్చులను తగ్గించుకోవడమేనట. ఈ వార్తలు ప్రస్తుతం టెక్కీలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

తొలగించిన ఉద్యోగులకు ఇచ్చే సెవెరెన్స్ పేమెంట్స్ అదే పరిహారం కోసం కాగ్నిజెంట్ ఇప్పటికే పక్కన పెట్టిందట. కంపెనీ సుమారు 270 మిలియన్ డాలర్లు అంటే మన భారత కరెన్సీ లెక్కల ప్రకారం దాదాపు రూ.2వేల 430 కోట్లు ఇందుకోసం కేటాయించింది. ఇంత భారీ మొత్తాన్ని కేటాయించారంటే లేఆఫ్స్ ప్రభావం ఎంత తీవ్రంగా ఉండబోతుందో అర్థం చేసుకోవచ్చు.

**మిడ్-లెవల్ ఉద్యోగులకే ముప్పు?**

ఈ లేఆఫ్స్ ప్రధానంగా సంస్థలోని మిడ్-లెవల్ టెక్కీలపై పడే అవకాశం ఉంది. ఒకవైపు 4వేల మందిని తొలగిస్తూనే, మరోవైపు 20వేల మంది ఫ్రెషర్లను తీసుకుంటామని కంపెనీ ప్రకటించడం గమనార్హం. అంటే ఎక్కువ జీతాలు తీసుకునే అనుభవజ్ఞుల స్థానంలో.. తక్కువ ఖర్చుతో ఆటోమేషన్ ఉపయోగిస్తూ ఫ్రెషర్లతో పనులు జరిపించాలని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్త హెడ్‌కౌంట్ 3లక్ష 57వేల 600గా ఉంది.

కంపెనీ సీఈఓ ఎస్. రవికుమార్ నేతృత్వంలో జరుగుతున్న రెండవ రౌండ్ లేఆఫ్స్ ఇవి. కేవలం మనుషులపై ఆధారపడకుండా.. ప్లాట్‌ఫారమ్ ఆధారిత ఏఐ సేవలను అందించడమే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ లీప్'ను రూపొందించారు. దీనివల్ల కంపెనీకి ఏడాదికి సుమారు రూ.2వేల 700 కోట్లు ఆదా అవుతుందని అంచనా.

**కొత్త కంపెనీల కొనుగోలు..**

ఒకవైపు ఉన్న ఉద్యోగులను తొలగిస్తూనే.. మరోవైపు వ్యాపార విస్తరణకు కాగ్నిజెంట్ భారీగా ఖర్చు చేస్తోంది. కాలిఫోర్నియాకు చెందిన ఐటీ సేవల సంస్థ ఆస్ట్రేయాను రూ.5వేల 400 కోట్లు పెట్టి కొనేందుకు సిద్ధమైంది టెక్ దిగ్గజం. డిజైన్ అండ్ ఏఐ డీల్స్‌ను దక్కించుకోవడంలో ఈ వ్యూహం తోడ్పడుతుందని భావిస్తోంది.

**భారతీయ టెక్కీలపై ప్రభావం..**

కాగ్నిజెంట్ ఉద్యోగుల్లో ఎక్కువ శాతం మంది భారత్‌లోనే ఉన్నారు. కాబట్టి ఈ 4వేల మంది తొలగింపు ప్రభావం భారతీయ సెంటర్లపైనే ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, ఆర్థిక అనిశ్చితి కారణాలతో ఐటీ రంగం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. ఒరాకిల్, టీసీఎస్ గతంలోనే కోతలు విధించగా.. ఇప్పుడు కాగ్నిజెంట్ వంతు వచ్చింది. ఈ పరిణామాలతో ఐటీ నిపుణులు తమ నైపుణ్యాలను ఏఐ దిశగా అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

# మే బ్యాంక్ హాలిడేస్ లిస్ట్: ఎన్ని రోజులు సెలవులో ఉంటాయో తెలుసా?




మే నెల వచ్చేసింది. వేసవి సెలవుల సందడితో పాటు.. ఈ నెలలో బ్యాంకులకు కూడా వరుస సెలవులు ఉన్నాయి. మీరు బ్యాంకుకు వెళ్లి పూర్తి చేయాల్సిన పనులేవైనా ఉంటే.. ఈ హాలిడే లిస్ట్‌ను ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది. రిజర్వ్ బ్యాంక్ క్యాలెండర్ ప్రకారం మే నెలలో పండుగలు, వేడుకలు, వారాంతపు సెలవులతో కలిపి బ్యాంకులు ఏఏ రోజులన మూతపడతాయో ఇప్పుడు తెలుసుకోండి.ఈ నెలలో ప్రధానంగా మే డే, బుద్ధ పౌర్ణమి, బక్రీద్ వంటి పండుగలు ఉన్నాయి.

**మే 2026 బ్యాంక్ సెలవుల జాబితా:**

మే 1 (శుక్రవారం): మే డే (కార్మికుల దినోత్సవం) / మహారాష్ట్ర దినోత్సవం / బుద్ధ పౌర్ణమి.
మే 3 (ఆదివారం): వారాంతపు సెలవు.
మే 9 (రెండవ శనివారం): బ్యాంక్ సెలవు. పశ్చిమ బెంగాల్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కూడా.
మే 10 (ఆదివారం): వారాంతపు సెలవు.
మే 16 (శనివారం): సిక్కిం రాష్ట్ర అవతరణ దినోత్సవం (ఆ రాష్ట్రంలో మాత్రమే సెలవు).
మే 17 (ఆదివారం): వారాంతపు సెలవు.
మే 23 (నాల్గవ శనివారం): బ్యాంక్ సెలవు.
మే 24 (ఆదివారం): వారాంతపు సెలవు.
మే 27 (బుధవారం): ఈద్-ఉల్-అధా (బక్రీద్) - చాలా రాష్ట్రాల్లో సెలవు.
మే 28 (గురువారం): బక్రీద్ సెలవు (కొన్ని ప్రాంతాల్లో రెండవ రోజు సెలవు ఉంటుంది).
మే 31 (ఆదివారం): వారాంతపు సెలవు.

బ్యాంకులు భౌతికంగా క్లోజ్ అయినప్పటికీ.. కస్టమర్ల డిజిటల్ అవసరాల కోసం సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయాని మర్చిపోవద్దు. సెలవులతో సంబంధం లేకుండా నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ యాప్స్ ద్వారా ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఎప్పుడైనా చేసుకోవచ్చు. అలాగే గూగుల్ పే, ఫోన్ పే వంటి యూపీఐ సర్వీసులు సెలవులతో సంబంధం లేకుండా పని చేస్తాయి. అలాగే క్యాష్ విత్ డ్రా కోసం ఏటీఎంలు 24/7 అందుబాటులో ఉంటాయి. అయితే చెక్కుల క్లియరెన్స్ లేదా లోన్ అప్లికేషన్ వంటి పనుల కోసం సెలవులకు రెండు రోజుల ముందే బ్యాంకుకు వెళ్లడం మంచిది. సో సెలవులకు అనుగుణంగా మీ పనులను ప్లాన్ చేసుకుంటే ఎలాంటి ఆటంకం లేకుండా ఆర్థిక లావాదేవీలను పూర్తి చేసుకోవచ్చు.

# మే 1 నుంచి కొత్త గ్యాస్ బుక్కింగ్ రూల్స్.. డొమెస్టిక్ సిలిండర్ల రేట్లు పెరుగుతాయా..?



మే నెల ప్రారంభం కావడానికి ముందే సామాన్యులకు షాకిచ్చే వార్తలు వినిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్, గ్యాస్ ధరల్లో వస్తున్న మార్పుల వల్ల మే 1 నుంచి ఎల్పీజీ సిలిండర్ల ధరలతో పాటు, వాటి బుకింగ్ రూల్స్‌లో కూడా కీలక మార్పులు వస్తున్నాయి. సామాన్య మధ్యతరగతి ప్రజల వంటగది బడ్జెట్‌పై ప్రభావం చూపే ఆ మార్పులేంటో ఇప్పుడు చూద్దాం.

**గ్యాస్ బండ రేట్లు మళ్లీ పెరగనున్నాయా?**

చమురు మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన గ్యాస్ ధరలను సమీక్షిస్తాయి. గత ఏప్రిల్‌లో డొమెస్టిక్ సిలిండర్ ధర సుమారు రూ.60 పెరగ్గా, కమర్షియల్ సిలిండర్ల ధరలు ఏకంగా 3 సార్లు పెరిగాయి. గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలతో పాటు ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్లు దాటడంతో.. మే నెలలో కూడా గ్యాస్ ధరలు మరోసారి పెరిగే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి.

**బుకింగ్ రూల్స్ కఠినం..**

సిలిండర్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం గ్యాస్ బుకింగ్ రూల్స్ కఠినతరం చేస్తోంది. ఇకపై పట్టణ ప్రాంతాల్లో రెండో సిలిండర్ బుక్ చేసుకోవాలంటే కనీసం 25 రోజుల వేచి ఉండాల్సిందే. గతంలో ఇది 21 రోజులుగా ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ నిరీక్షణ సమయం ఏకంగా 45 రోజులకు పెరిగే అవకాశం ఉంది. హోర్డింగ్, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యంగా తెలుస్తోంది.

**ఓటీపీ ఉంటేనే డెలివరీ..**

సిలిండర్ డెలివరీ ప్రక్రియలో పారదర్శకత కోసం ప్రభుత్వం 'డీఏసీ' డెలివరీ అథెంటికేషన్ కోడ్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తోంది.

సిలిండర్ మీ ఇంటికి వచ్చినప్పుడు.. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెబితేనే గ్యాస్ సిలిండర్ అందుతుంది. ఇప్పటికే 94 శాతం డెలివరీలు ఈ పద్ధతిలోనే జరుగుతుండగా.. మే 1 నుంచి దీన్ని 100 శాతం అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

**ఎందుకు ఈ మార్పులు?**

అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్న తరుణంలో.. సబ్సిడీ సిలిండర్లు అర్హులకే అందేలా చూడటంతో పాటుగా పంపిణీలో పారదర్శకత తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. వినియోగదారులు కూడా నెలవారీ ధరల అప్డేట్స్‌ను గమనిస్తూ.. కొత్త రూల్స్ కి అనుగుణంగా తమ బుకింగ్‌లను ప్లాన్ చేసుకోవడం కీలకం.

# శుభవార్త చెప్పిన ఇన్ఫోసిస్.. ఉద్యోగుల తొలగింపులు ఉండవంటూ సీఈఓ భరోసా




గత కొంత కాలంగా ఐటీ రంగం అంటేనే లేఆఫ్స్ అనే భయం టెక్కీలను వెంటాడుతోంది. కాగ్నిజెంట్, టీసీఎస్, ఒరాకిల్ వంటి దిగ్గజ సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపిస్తుంటే.. ఇన్ఫోసిస్ మాత్రం అందుకు భిన్నమైన ప్రకటన చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ సంస్థలో లేఆఫ్స్ ఉండబోవని ఇన్ఫోసిస్ సీఈఓ సలిల్ పరేఖ్ స్పష్టం చేయడంతో టెక్కీలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

**ఏఐతో ఉద్యోగాలకు ఢోకా లేదు..**

ఏఐ రాకతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఊడిపోతాయన్న వార్తలను సలిల్ పరేఖ్ కొట్టిపారేశారు. ఏఐ వల్ల పని పరిధి పెరుగుతుందే తప్ప తగ్గదని చెప్పారు. టెక్నాలజీ మారుతున్న కొద్దీ ఉద్యోగులకు కొత్త నైపుణ్యాలను నేర్పిస్తామే తప్ప, వారిని తొలగించే ఆలోచన లేదని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఇన్ఫోసిస్ ఆదాయంలో ఏఐ వాటా 5.5 శాతంగా ఉందని ఇది వేగంగా పెరుగుతోందని చెప్పారు. ఉద్యోగులను తీసేయడం అనే మాటలను పక్కన పెడితే.. కొత్త రక్తానికి ఇన్ఫోసిస్ పెద్దపీట వేస్తోంది. ఈ ఏడాది కూడా దాదాపు 20వేల మంది ఫ్రెషర్లను క్యాంపస్ హైరింగ్ ద్వారా తీసుకోబోతున్నట్లు ప్రకటించింది. గతేడాది కూడా ఇదే స్థాయిలో రిక్రూట్‌మెంట్ జరగడం విశేషం. దీనివల్ల నిరుద్యోగ టెక్కీల్లో సరికొత్త ఉత్సాహం మట్నదలైంది. జాబ్ కొట్టాలంటే స్కిల్స్ పక్కాగా ఉంటే సరిపోతుందని యువత గమనిస్తే ఐటీ రంగంలో మంచి అవకాశాలు ఇంకా మిగిలే ఉన్నాయని ఇన్ఫోసిస్ ప్రకటన చెబుతోంది.

ఎంట్రీ లెవల్ ఉద్యోగాల స్వభావం మారుతున్న వేళ.. ఇన్ఫోసిస్ తన ఇంజనీర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. ఏఐ టూల్స్ సహాయంతో కోడింగ్ చేయడం, వాటిని విశ్లేషించడం వంటి అంశాలపై ఉద్యోగులను సిద్ధం చేస్తోంది. ఇందుకోసం ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడమే కాకుండా..

'టోపాజ్ ఫ్యాబ్రిక్' వంటి అంతర్గత ప్లాట్‌ఫారమ్‌లను కూడా ఇన్ఫోసిస్ ఉపయోగిస్తోంది. ప్రస్తుతం ఇన్ఫోసిస్ ఇచ్చిన ఈ భరోసా టెక్కీల పాలిట వరంగా మారింది. గత ఏడాది లాగానే లేఆఫ్స్ ఉండవు అంటూ ఇన్ఫోసిస్ చెప్పటంతో టెక్కీలు ఆల్ ఈజ్ వెల్ అంటూ ఊపిరిపీల్చుకుంటున్నారు.

## తగ్గిన బంగారం, వెండి.. తెలుగు రాష్ట్రాల్లో తాజా రేట్లివే..



పరిస్థితులు చూస్తుంటే ఇప్పట్లో బులియన్ మార్కెట్లు తిరిగి పుంజుకునేలా కనిపించటం లేదు. ఒకపక్క వెండి ధరలు కరెక్షన్ ఫేజ్ లో కొనసాగుతుంటే.. మరో పక్క బంగారం క్లారిటీ లేక దాదాపుగా స్థిరంగానే కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆభరణాలు కొనాలనుకుంటున్న తెలుగు రాష్ట్రాల ప్రజలు ముందుగా తమ సమీప నగరాల్లో తాజా రేట్లను పరిశీలించటం మంచిది.

ఏప్రిల్30న బంగారం రేట్లు పెరిగాయి. ఏప్రిల్ 29 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.22 పెరుగుదలను నమోదు చేసింది. అయితే హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.15వేల 066గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 810గా కొనసాగుతోంది. గురువారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. ఏప్రిల్30, 2026న దేశవ్యాప్తంగా రేటు కేజీకి రూ.5వేలు తగ్గింది. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.2లక్షల 60వేల వద్ద ఉంది. అంటే గ్రాము ధర రూ.260గా అమ్మకాలు జరుగుతున్నాయి.

# టీమిండియా కెప్టెన్ గా రిషభ్ పంత్.. పడిక్కల్, నబీలకు బెస్ట్ ఛాన్స్!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ ముగిసిన వెంటనే వారం రోజుల గ్యాప్ లో టీమిండియాతో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ఒక టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. జూన్ 6 నుంచి 10 వరకు ఈ టెస్ట్ మ్యాచ్ జరగనుంది. దాదాపు 8 ఏళ్ల తర్వాత ఆఫ్ఘన్ తో భారత క్రికెట్ జట్టు రెడ్ బాల్ క్రికెట్ ఆడుతుండడం విశేషం. ఎలాగో టెస్ట్ ఛాంపియన్ షిప్ లో ఆఫ్ఘనిస్తాన్ భాగం కాకపోవడంతో ఈ టెస్టులో సీనియర్స్ ను రెస్ట్ లభించడం ఖాయంగా కనిపిస్తుంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రాలతో కొంత మంది స్టార్ ప్లేయర్స్ కి రెస్ట్ ఇవ్వాలని సెలెక్టర్లు ఆలోచిస్తున్నట్టు సమాచారం. కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజాలు కూడా ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ ఆడకపోవచ్చు. గిల్ రెస్ట్ తీసుకోవడంతో వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. ఐపీఎల్ ముగింపుకూ, ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే ఏకైక టెస్టు ఆరంభానికి మధ్య చాలా తక్కువ సమయం ఉంది. ఆటగాళు అలసిపోకుండా వారి పని భారాన్ని దృష్టిలో పెట్టుకొని సెలెక్టర్లు, జట్టు యాజమాన్యం జాగ్రత్త తీసుకుంటున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే మన జట్టు ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. 2027లో వన్డేవరల్డ్ కప్ ఉండడంతో ఈ మూడు వన్డేల సిరీస్ కు పూర్తిస్థాయి భారత జట్టు బరిలోకి దిగనుంది. ఆఫ్ఘనిస్తాన్ తో జరగబోయే ఏకైక టెస్టుకు సీనియర్స్ కు రెస్ట్ ఇస్తే వన్డే సిరీస్ కు రెండు వారాల విరామం లభిస్తుంది. అప్పుడు వర్క్ లోడ్ లేకుండా వన్డే సిరీస్ లో ప్లేయర్స్ ఆడతారు. ఏదైనా ఐపీఎల్ ముగిసేలోపు అధికార ప్రకటన రానుంది.

స్టార్ ప్లేయర్స్ రెస్ట్ తీసుకోవడంతో ఇప్పుడు దేశవాళీ క్రికెట్ లో బాగా రాణించిన వారికి ఈ టెస్ట్ మ్యాచ్ లో ఛాన్స్ లభిస్తుంది. డొమెస్టిక్ క్రికెట్ లో పరుగుల వరద పారిస్తున్న దేవ్ దత్ పడికల్ తో పాటు గత రంజీ ట్రోఫీలో 10 మ్యాచ్ ల్లోనే 60 వికెట్లు పడగొట్టిన ఔకిబ్ నబీకి ఛాన్స్ దక్కనుంది. వీరిద్దరిపైనే అందరి దృష్టి నెలకొంది. సెలెక్టర్లను ఆకట్టుకున్న వారిలో ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్, స్పిన్నర్ మానవ్ సుతార్ కూడా ఉన్నారు. ఐపీఎల్ ఫైనల్‌కు, ఆఫ్ఘనిస్తాన్ టెస్టుకు మధ్య పెద్దగా విరామం లేదు. కాబట్టి ఆటగాళ్లు అలసిపోకుండా సెలెక్టర్లు, యాజమాన్యం జాగ్రత్త పడతారు. ఎందుకంటే టెస్ట్ తర్వాత ఆఫ్ఘనిస్థాన్ తో మూడు వన్డేలు, ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో వైట్-బాల్ సిరీస్ ఉన్నాయి. శుభ్‌మన్ గిల్ స్థానంలో మిడిల్ ఆర్డర్ లో పడికల్ ఆడనున్నాడు. జడేజా, కుల్దీప్ కు రెస్ట్ ఇస్తే ఆ స్థానంలో మానవ్ సుతార్ కు అవకాశం దక్కొచ్చు. బుమ్రా ప్లేస్ లో ఆకిబ్ నబీ జట్టులోకి రానున్నాడు. ఓపెనర్ రాహుల్ స్థానంలో సాయి సుదర్శన్ జట్టులోకి రావొచ్చు. యంగ్ స్టార్స్ కు అవకాశమిస్తే రానున్న ఏడాదిలో టీమిండియా కీలక టెస్ట్ సిరీస్ లలో వీరికి అవకాశం దక్కనుంది. వీటిలో ప్రధానంగా న్యూజిలాండ్ లో రెండు టెస్టులతో పాటు ఆస్ట్రేలియాతో 5 టెస్ట్ మ్యాచ్ ల బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ ఆడాల్సి ఉంటుంది. 2027 ఎండింగ్ లో వరల్డ్ కప్.. అదే ఏడాది జూన్ లో టెస్ట్ ఛాంపియన్ షిప్ ఉండడంతో భారత్ ఈ రెండు ఫార్మాట్ల పైనే ఎక్కువగా దృష్టి పెట్టనుంది.

# ఆర్సీబీపై రివేంజ్ తీర్చుకున్న టైటాన్స్.. ఘోరంగా ఓడిన బెంగళూరు

ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా జరిగిన హై-వోల్టేజ్ పోరులో గుజరాత్ టైటాన్స్ అదరగొట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే ఛేదించి, 5 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీని నమోదు చేసింది. ఈ విజయంతో టైటాన్స్ పాయింట్ల పట్టికలో ఓ అడుగు ముందుకు వేసింది.



**గిల్ మెరుపు ఇన్నింగ్స్:**
లక్ష్య ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. 42 పరుగుల వద్ద సాయి సుదర్శన్ (6) భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో అవుట్ అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (18 బంతుల్లో 43; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆర్సీబీ బౌలర్లను ఒక ఆటాడుకున్నాడు. హాఫ్ సెంచరీకి చేరువవుతున్న సమయంలో భువీ బౌలింగ్‌లో విరాట్ కోహ్లీకి క్యాచ్ ఇచ్చి గిల్ వెనుదిరిగాడు. అనంతరం జోస్ బట్లర్ (19 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) తనదైన శైలిలో సిక్సర్లతో విరుచుకుపడి మ్యాచ్‌ను ఏకపక్షం చేశాడు. మధ్యలో షారుఖ్ ఖాన్, వాషింగ్టన్ సుందర్ (11) తక్కువ స్కోరుకే అవుట్ అయి ఉత్కంఠ రేపినప్పటికీ, చివర్లో రాహుల్ తెవాటియా భారీ షాట్లతో ఫినిషింగ్ టచ్ ఇచ్చి జట్టుకు విజయాన్ని అందించాడు.

**భువీ పోరాటం వృథా:**
ఆర్సీబీ బౌలర్లలో వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ (3 వికెట్లు) అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్ టైటాన్స్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేశాడు. రొమారియో షెపర్డ్ రెండు వికెట్లు తీయగా, సుయాష్ శర్మకు ఒక వికెట్ దక్కింది. అయితే స్వల్ప స్కోరు కావడంతో బెంగళూరు బౌలర్లు ఓటమిని అడ్డుకోలేకపోయారు. కేవలం 15.5 ఓవర్లలోనే మ్యాచ్ ని ఖతం చేసేసింది గుజరాత్.

# "బర్త్ డే భాయ్" రోహిత్ శర్మ ట్రాక్ రికార్డ్.. కోహ్లీ, సచిన్ వల్ల కూడా కాలేదుగా





**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన ప్లేయర్స్ లలో ఒకరైన హిట్ మ్యాన్, రోహిత్ శర్మ నేడు తన 39వ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకుంటున్నాడు. స్టేడియంలో పరుగుల వరద పారించడమే కాదు, కెప్టెన్‌గా టీమిండియాకు ప్రపంచ కప్‌లను అందించిన ఈ 'హిట్‌మ్యాన్' పేరిట కొన్ని అద్భుతమైన రికార్డులు కూడా ఉన్నాయి. ఆధునిక క్రికెట్‌లో వాటిని అధిగమించడం ఇప్పటి వరకు ఏ బ్యాటర్‌కైనా అంత సులభం కాదు. అవేంటో ఇప్పుడు ఒకసారి చూద్దాం..

డబుల్ సెంచరీల కింగ్: వన్డేల్లో ఒక్క డబుల్ సెంచరీ కొట్టడమే గగనమైన వేళ, రోహిత్ శర్మ ఏకంగా మూడుసార్లు ఈ రికార్డుని సాధించి చరిత్రలోకి ఎకెక్కాడు. ఆస్ట్రేలియాపై ఒకసారి, శ్రీలంకపై రెండుసార్లు డబుల్ సెంచరీలు కొట్టి 'డబుల్ సెంచరీల కింగ్' అని పిలుపించుకున్నాడు. వరల్డ్ లో మరే ఇతర బ్యాటర్ కూడా ఇప్పటి వరకు ఈ స్థాయికి చేరుకునేందుకు ప్రయత్నం కూడా చేయలేకపోయాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక సెంచరీలు: ప్రపంచ కప్ లాంటి భారీ టోర్నీలలో రోహిత్ శర్మ ప్రదర్శన అమోఘం.. వన్డే వరల్డ్ కప్ చరిత్రలో అత్యధికంగా 7 సెంచరీలు కొట్టిన రికార్డు అతడి పేరుపైనే ఉంది. ఈ క్రమంలో ఆయన సాక్షాత్తు సచిన్ టెండూల్కర్ ఘనతని కూడా అధిగమించాడు. ముఖ్యంగా 2019 వరల్డ్ కప్‌లో ఒకే టోర్నీలో 5 శతకాలు సాధించి రికార్డు సృష్టించాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు: క్రికెట్ ప్రపంచం ఎప్పటికీ గుర్తు పెట్టుకునే రికార్డు రోహిత్ శర్మ పేరుపైనే ఉంది. 2014లో కోల్‌కతా వేదికగా శ్రీలంకపై జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ ఏకంగా 264 రన్స్ సాధించి వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఒక ఇన్నింగ్స్‌లో 33 ఫోర్లు, 9 సిక్సర్లతో విరుచుకుపడి.. ఈ మైలురాయిని చేరుకోవడం ప్రస్తుత తరం ప్లేయర్స్ కి ఒక కలగానే మిగిలిపోయింది.

ఇంటర్నేషనల్ క్రికెట్‌లో సిక్సర్ల రారాజు: సిక్సర్లు బాదడంలో రోహిత్ శర్మకు సాటి ఎవరూ రాలేడు.. క్రికెట్ 3 ఫార్మాట్లలో కలిపి మొత్తం 650కి పైగా సిక్సర్లు బాది వరల్డ్ లోనే అగ్రస్థానంలో నిలిచాడు. వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ పేరుపై ఉన్న ఘనతని తుడిచి పెట్టిన హిట్ మ్యాన్, తన అద్భుతమైన టైమింగ్‌తో 'సిక్స్ మెషీన్'గా గుర్తింపు తెచ్చుకున్నాడు.

# హీరోలే డూప్‌లు వాడేస్తుంటే ఇంత సాహసం ఎందుకు?



కృతి శెట్టి ఎలిగెంట్ ఎత్నిక్ గ్లామ్‌లో మెరిసింది

గత కొంత కాలంగా స్టార్ హీరోలు పాన్ ఇండియా సినిమాలకు హై రిస్క్ ఉన్న యాక్షన్ సీక్వెన్స్‌ల కోసం బాడీ డబుల్‌ని వాడేస్తున్నారని, సాహసాలు చేయడానికి ఇష్టపడటం లేదని, అయితే ఈ విషయాన్ని హీరోలు బయటికి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని నటుడు, డైరెక్టర్ రవిబాబు ఇటీవల ఓ బాంబ్ పేల్చిన విషయం తెలిసిందే. హీరోలు ఇలా రిస్క్ యాక్షన్ సీన్‌ల విషయంలో బాడీ డబుల్స్‌ని వాడేస్తుంటే హీరోయిన్ రష్మిక మందన్న మాత్రం అందుకు పూర్తి భిన్నంగా రిస్క్ చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

గత ఏడాది పలు క్రేజీ సినిమాల్లో నటించి టాక్ ఆఫ్ ది ఇండియాగా నిలిచిన రష్మిక ప్రస్తుతం భర్త విజయ్ దేవరకొండతో కలిసి -రణబాలి-లో నటిస్తూనే ఓ పవర్ ఫుల్ స్టోరీతో రూపొందుతున్న లేడీ ఓరియెంటెడ్ యాక్షన్ డ్రామా -మైసా-లో నటిస్తోంది. దీనికి రవీంద్ర పుల్లె దర్శకుడు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక ఈ సినిమా కోసం ఎంత రిస్క్ చేయడానికైనా వెనుకాడటం లేదు. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేని విధంగా రష్మిక మందన్న ఓ సాహసం చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ మూవీ కోసం గోండు తెగకు చెందిన ముదతిగా పవర్ ఫుల్ పాత్రలో కనిపించబోతోంది. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. ఈ సినిమా కోసం రష్మిక తాజాగా పెద్ద రిస్కే చేసిందని తెలిసింది. ఆ విషయాన్ని స్వయంగా డైరెక్టర్ రవీంద్ర పుల్లె వెల్లడించడంతో అంతా షాక్ అవుతున్నారు. ఇందులో టైటిల్ పాత్ర పోషిస్తున్న రష్మిక పాత్ర చాలా ప్రభావ వంతంగా ఉంటుందని, ఆమె ప్రదర్శించే కోపం, ఆవేః ఈ సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయన్నారు.

ఇటీవల కేరళలోని అతిర జలపాతం వద్ద అత్యంత క్లిష్టమైన ఓ యాక్షన్ సీన్‌ని షూట్ చేశాం. అయితే ఈ సన్నివేశం కోసం రష్మిక 80 అడుగుల ఎత్తు నుంచి ఎలాంటి డూప్ లేకుండా దూకారు. ఆ సమయంలో ఆమె చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి. అయినా విరామం తీసుకోకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. సినిమా పట్ల, నటన పట్ల ఆమెకున్న నిబద్ధతను చూసి టీమ్ అంతా ఆశ్చర్యపోయాం- అన్నారు. అయితే ఈ విషయం తెలిసిన నెటిజన్‌లు, అభిమానులు మాత్రం స్టార్ హీరోలే రిస్కీ యాక్షన్ సీక్వెన్స్‌లు చేయడానికి భయపడుతున్నారు. ఇందు కోసం బాడీ డబుల్‌లని వాడేస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఎలాంటి డూప్ లేకుండా ఇలా రిస్క్‌లు చేయడం అవసరమా? అని వాపోతున్నారు. 80 అడుగుల ఎత్తులో నుంచి దూకడం అనేది కరెక్ట్ కాదని, ఇకపై అలాంటి రిస్క్‌లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.





సోనాల్ చౌహాన్ యొక్క పూల్‌సైడ్ ఫోటోషూట్ వైరల్‌గా మారింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965